ప్రతిపక్షం

www.prathipaksham.in

శనివారం 10.01.2026 Published from: Hyderabad సంపుటి: 18 సంచిక: 291 పేజీలు:09 వెల రూ. 5/-

@prathipaksham prathipaksham tv telugu





ప్రతిపక్షం ఫజల్ రహమాన్..
ప్రజల కలల కాంతి

ప్రతిపక్షం ఫజల్ రహమాన్
ప్రజల గొంతుకకు రూపం,
మౌనంలో దాగిన ఆర్తనాదానికి అక్షరం.
అతను ప్రతిపక్షం కాదు —
అతనే ప్రజల పక్షం.
చీకట్ల మధ్య వెలిగిన దీపం,
రాత్రి నడుమ ఉదయించిన సూర్యోదయం.
అన్యాయం గర్జించిన వేళ
సత్యం నిశ్శబ్దంగా నిలిచినప్పుడు,
ఆ నిశ్శబ్దాన్ని పగలగొట్టిన
ధైర్య స్వరం ఫజల్ రహమాన్.
పగలంత పోరాటం అతని జీవితం,
వెన్నెలంత మృదుత్వం అతని హృదయం.
ప్రజల కన్నీళ్లలో అతను బాధను చూశాడు,
ఆ బాధనే ఉద్యమంగా మలిచాడు.
మీరు చూపిన దారి
ఒక వ్యక్తి బాట కాదు,
ఒక తరానికి దిక్సూచి.
మీ అడుగుల చప్పడే
ఈ రోజు ప్రజా ఉద్యమానికి తాళం.
మీ శరీరం మట్టిలో లీనమైనా,
మీ ఆశయాలు కాలాన్ని దాటి
నడుస్తున్నాయి.
మీ కలలు మృతిచెందలేదు —
అవి ఇంకా ప్రజల ఊపిరిలో జీవిస్తున్నాయి.
మీరు నాటిన చిన్న విత్తనం
ఈ రోజు ప్రతిపక్షం దినపత్రికగా
మహా వృక్షమైంది.
సత్యానికి నీడగా,
ప్రజల హక్కులకు ఆయుధంగా,
అణచివేతకు ఎదురుగా నిలిచిన అడవిగా.
ఈ వృక్షం వేర్లు
ప్రజల హృదయాల్లో నాటుకున్నాయి.
దాని ఆకులలో ఆశలు కదులుతున్నాయి.
దాని నీడలో న్యాయం ఊపిరి పీలుస్తోంది.
మీ కలల నిజాన్ని
వెలుగు దిశగా తీసుకెళ్లే వరకు
ప్రతిపక్షం ఆగదు.
ప్రజల పక్షాన నిలబడి
పోరాటమే తన ప్రార్థనగా
నడుస్తూనే ఉంటుంది.

చిటుకుల మైసారెడ్డి..

ప్రతిపక్షం

www.prathipaksham.in



నదైన్ నయా విధ్వంసం 8

శనివారం 10.01.2026 | Published from: Hyderabad | సంపుటి: 18 సంచిక: 291 పేజీలు:09 వెల రూ. 5/-

@prathipaksham | prathipaksham tv telugu

ప్రతిపక్షం వ్యవస్థాపక సంపాదకులు ఇక లేరు



చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచిన ఫజుల్ రహమాన్



పాత్రికేయ మిత్రుడు, రచయిత ఉపాధ్యాయుడు 'ప్రతిపక్షం దినపత్రిక' సంపాదకుడు మహమ్మద్ ఫజుల్ రహమాన్ (66)ఇక లేరు. అనారోగ్యానికి చికిత్స పొందుతూ హైదరాబాద్ లోని నిమ్స్ ఆసుపత్రిలో శుక్రవారం రాత్రి ఆయన తుది శ్వాస విడిచారు. ఆరు రోజులుగా హైదరాబాదులో నిమ్స్ ఆసుపత్రిలో క్యాన్సర్ వ్యాధికి ఆయన చికిత్స పొందుతున్నారు. ఆసుపత్రిలో అపస్మారక స్థితిలో ఉన్న ఆయన శుక్రవారం రాత్రి పరమపదించారు. ఇది చాలా విషాదకరమైన బాధాకరమైన సంఘటన. మహమ్మద్ ఫజల్ రహ్మాన్ ఉమ్మడి కరీం నగర్ జిల్లా, ప్రస్తుత సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ ప్రాంతానికి చెందిన వారు. ఆయన సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం అంతక పేటలో 1960లో జన్మించారు. హుస్నాబాద్ లో ఆంధ్రప్రభ విలేకరిగా 1980లో జర్నలిస్టు జీవితం ప్రారంభించారు. ఆంధ్రప్రభలో చాలా సంవత్సరాలు పనిచేశారు.

ప్రజాతంత్ర సిద్దిపేట ప్రతినిధిగా పనిచేశారు. తరువాత హైదరాబాదులో జీవగడ్డ, ఆంధ్ర జ్యోతి పత్రికలో పని చేశారు. 'దిశ 'పత్రికలో ఆవిర్భావం నుంచి పనిచేశారు. ఆ తర్వాత 'ముద్ర ' పత్రికలో కొంతకాలం పని చేశారు. రెండు సంవత్సరాల కిందట సొంతంగా 'ప్రతిపక్షం' దినపత్రిక ప్రారంభించారు. ప్రస్తుతం సంపాదకులు గా ఆ పత్రిక సంపాదకులుగా కొనసాగుతున్నారు. హుస్నాబాద్ పబ్లిక్ స్కూల్ పాఠశాలను 1990 ప్రాంతంలో ప్రారంభించి ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్దారు. హుస్నాబాద్ లో ప్రెస్ క్లబ్ ఆవిర్భావం, జర్నలిస్టు సంఘం నిర్మాణం, హుస్నాబాద్ యూత్ అసోసియేషన్ నిర్మాణంల, స్ఫూర్తి అసోసియేషన్లో ఆయనకు అనుబంధం ఉంది. ఫజల్ రెహమాన్ కు ముగ్గురు కుమారులు ఒక కుమార్తె ఉన్నారు. జర్నలిస్ట్ గా ఆయన పలువురికి స్ఫూర్తిగా నిలిచారు. ఆయన మృతి పలువురు జర్నలిస్ట్ లను దిగ్భ్రాంతికి గురి చేసింది. ఫజల్ భాయ్ కి పలువురు జర్నలిస్టులు కన్నీటి నివాళులు అర్పించారు.

ఫజల్ రహమాన్ మృతి పట్ల టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు విరాహత్ అలీ దిగ్భ్రాంతి..

వర్కింగ్ జర్నలిస్టుల సంతాపం

సీనియర్ జర్నలిస్టు ఫజల్ ఉల్ రహ్మాన్(65) అకాల మృతి పట్ల తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేసింది. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ ఆలీ మాట్లాడుతూ కలకుంట్ల రంగాచారి, మాట్లాడుతూ జీవగడ్డ, ఆంధ్రప్రభ, ఆంధ్రజ్యోతి, సాక్షి, దిశ, ముద్ర తదితర పత్రికలలో వివిధ హోదాల్లో 38 సంవత్సరాలకు పైగా పనిచేసి, ప్రస్తుతం హైదరాబాద్ కేంద్రంగా 'ప్రతిపక్షం' డిజిటల్ దిన పత్రికను నిర్వహిస్తున్న ఫజల్ హఠాత్తుగా క్యాన్సర్ కాటుకు గురై ప్రాణాలు కోల్పోవడం అత్యంత విషాదకరమన్నారు. దాదాపు మూడున్నర దశాబ్దాలుగా ఉమ్మడి రాష్ట్రంలో ఏపీయూడబ్ల్యూజే, ప్రత్యేక రాష్ట్రంలో టీయూడబ్ల్యూజే సంఘాలకు ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని చెప్పారు. ఫజల్ వారం రోజుల క్రితం నిమ్స్ ఆసుపత్రిలో చేరిన ఫజల్ కు మెరుగైన చికిత్స అందేలా ఎంతోకృషిచేసామన్నారు. అయినా ఫలితం దక్కలేదన్నారు. గత కొంతకాలంగా ఆర్థిక కష్టాలను అనుభవిస్తున్న ఫజల్ ఉల్ రహ్మాన్ కుటుంబానికి టీయూడబ్ల్యూజే అండగా నిలిచి, ప్రభుత్వ పరంగా సహాయం అందేలా కృషి చేస్తుందని తెలిపారు. చిటుకుల మైసారెడ్డి, కూతురు రాజిరెడ్డి, అయ్యమ్మ గారి సత్యనారాయణ రెడ్డి, కత్తుల లక్ష్మారెడ్డి, ఆకుల పాండు, బబ్బూరి రాజు, నాయిని సంజీవరెడ్డి, మదూరు శ్రీరామ్, ఏల్పుల మహేష్, మజ్జు, నక్కల రాంరెడ్డి, చంద్రమౌళి, సాజిద్, కాసర్ల మురళి , ఆర్. అంజయ్య, నాయిని సంజీవ రెడ్డి, రంగధాంపల్లి శ్రీనివాస్, మదూరి శ్రీరామ్, అయిత శ్రీనివాస్, పోతరాజు రమేశ్, నిజామాబాద్ నర్సన్న, బాసిత్, గజ్వేల్ పులి బాల చంద్రుడు, పి.శంకర్, నర్సింగ్ రావు, సదానందం, దయానంద్, బొందుగుల నాగరాజు, అజయ్ కుమార్, మధుకర్, అజయ్, వీరేశం, ఆకుల శ్రీనివాస్, వెంకట్, తదితరులు ఫజల్ ఉల్ రహ్మాన్ మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

నేడు హుస్నాబాద్ లో అంత్యక్రియలు

సీనియర్ జర్నలిస్టు ఫజల్ రెహమాన్ అంత్యక్రియలు శనివారం హుస్నాబాద్ పట్టణంలో జరగనున్నాయి. హుస్నాబాద్ డివిజన్ ప్రెస్ క్లబ్ ఎదుట ఆయన భౌతిక కాయాన్ని సందర్శనార్థం ఉంచుతారు. నివాళులు అర్పించేందుకు జిల్లా, రాష్ట్ర , జాతీయ స్థాయి జర్నలిస్టుల సంఘాల నాయకులు హాజరుకానున్నారు. అనంతరం అంత్యక్రియలు జరిపేందుకు ఏర్పాట్లు చేశారు.

విలువల పాత్రికేయతకు ప్రతీక మహమ్మద్ ఫజల్ రహమాన్

ప్రతిపక్షం బ్యూరో,

పాత్రికేయతను ఒక వృత్తిగా కాకుండా, సమాజ బాధ్యతగా భావించిన వ్యక్తి మహమ్మద్ ఫజల్ రహమాన్. రచయితగా, ఉపాధ్యాయుడిగా, సంపాదకుడిగా ఆయన చేసిన సేవలు అమోఘం. అలాంటి వ్యక్తి ఇక లేరన్న వార్త మనసును తీవ్రంగా కలిచివేస్తోంది. 'ప్రతిపక్షం' దినపత్రిక సంపాదకుడు మహమ్మద్ ఫజల్ రహమాన్ (66) పరమపదించడం పాత్రికేయ లోకానికి తీరని లోటు. ఆరు రోజులుగా హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో క్యాన్సర్ వ్యాధికి చికిత్స పొందుతున్న ఆయన, అపస్మారక స్థితిలోకి చేరుకుని తుదిశ్వాస విడిచారు. ఆయన మరణం కుటుంబ సభ్యులకు మాత్రమే కాదు, పాత్రికేయ మిత్రులకు, విద్యార్థులకు, అభిమానులకు అపారమైన శూన్యతను మిగిల్చింది.

సమాజం పట్ల బాధ్యతతో...

మహమ్మద్ ఫజల్ రహమాన్ ప్రస్తుత సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గంలోని అక్కన్నపేట మండలం అంతకపేట గ్రామంలో 1960లో జన్మించారు. చిన్ననాటి నుంచే చదువు, సమాజం, న్యాయం పట్ల ఆసక్తి కలిగిన వ్యక్తిగా ఎదిగారు. ఆ ఆలోచనలే ఆయనను జర్నలిజం వైపు నడిపించాయి. హుస్నాబాద్ లో 'ఆంధ్రప్రభ' దినపత్రిక విలేకరిగా 1980 సంవత్సరంలో జర్నలిస్టు జీవితం ప్రారంభించారు. అప్పటి గ్రామీణ జర్నలిజంలో ఉన్న కష్టాలు, ఒత్తిడుల మధ్య కూడా నిజాన్ని రాయడమే లక్ష్యంగా పనిచేశారు. అనేక సంవత్సరాలు ఆంధ్రప్రభలో కొనసాగుతూ, ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చారు.

నగర పాత్రికేయత – అనుభవం,అవగాహన

ఆ తర్వాత హైదరాబాద్‌కు వెళ్లి ఆంధ్రజ్యోతి దినపత్రికలో పనిచేశారు. అక్కడ రాజకీయాలు, సమాజం, పాలనపై లోతైన అవగాహన పెంచుకున్నారు. అనంతరం 'దిశ' దినపత్రిలో ఆవిర్భావం నుంచే తన పాత్రికేయ ముద్రను చూపించారు. ఆ పత్రిక ఎదుగుదలలో ఆయన పాత్ర మరువలేనిది.

అనంతరం కొంతకాలం 'ముద్ర' దినపత్రికలో పనిచేసి, అనుభవాన్ని మరింత విస్తరించుకున్నారు.

*** ప్రతిపక్షం' – ఒక ధైర్యమైన ఆలోచన***

పాత్రికేయతపై తన స్వంత ఆలోచనలతో, అధికారానికి ప్రశ్నలు వేయగల వేదిక అవసరమని భావించారు. దీంట్లో భాగంగానే ఆయన, రెండు సంవత్సరాల కిందట 'ప్రతిపక్షం' దినపత్రికను స్వయంగా ప్రారంభించారు. సంపాదకుడిగా బాధ్యతలు చేపట్టి, ప్రజల గొంతుకగా పత్రికను నడిపించారు. నిజాయితీ, ధైర్యం, నిబద్ధతే ఆయన సంపాదకత్వానికి పునాదిగా మారింది.

విద్యారంగంలో రాణించి..

పాత్రికేయుడిగానే కాకుండా ఉపాధ్యాయుడిగా ఆయన అందించిన సేవలు అపూర్వం. హుస్నాబాద్ పబ్లిక్ స్కూల్ 1990లో స్థాపించి వందలాది మంది విద్యార్థులను తీర్చిదిద్దారు. చదువు అంటే కేవలం పుస్తకాలు కాదు, మంచి మనిషిని తయారు చేసే దిశగా ఆయన బోధన సాగింది.

సామాజిక చైతన్యానికి కృషి

హుస్నాబాద్ ప్రాంతంలో సామాజిక చైతన్యానికి ఆయన చేసిన కృషి వెలకట్టలేనిది. హుస్నాబాద్ ప్రెస్ క్లబ్ ఆవిర్భావంలో కీలక భూమిక పోషించారు. జర్నలిస్టు సంఘం నిర్మాణంలోనూ పలు పంచుకున్నారు. హుస్నాబాద్ యూత్ అసోసియేషన్, స్ఫూర్తి అసోసియేషన్ కార్యక్రమాల్లో క్రియాశీలకంగా పాల్గొని యువతకు మార్గదర్శిగా నిలిచారు.

కుటుంబం – వ్యక్తిగత జీవితం

మహమ్మద్ ఫజల్ రహమాన్‌కు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కుటుంబానికి ఆదర్శంగా, పిల్లలకు మార్గ నిర్దేశకుడిగా ఆయన జీవితం సాగింది.

వ్యక్తిగతంగా కలిగిన వేదన

ఆయన మృతి నాకు వ్యక్తిగతంగా కూడా ఎంతో బాధ కలిగించింది. ఫజల్ భాయ్‌తో ఉన్న అనుబంధం, ఆయన ఆలోచనలు, మాటలు, సూచనలు ఎప్పటికీ గుర్తుండిపోతాయి. నిజాయితీతో జీవించడం ఎలా ఉంటుందో ఆయన జీవితం నేర్పింది. పాత్రికేయతకు విలువలు చేర్చిన మహమ్మద్ ఫజల్ రహమాన్ భౌతికంగా ఇక మన మధ్య లేకపోయినా, ఆయన ఆలోచనలు, సేవలు, ఆదర్శాలు ఎప్పటికీ నిలిచిపోతాయి. ఫజల్ భాయ్‌కు కన్నీటి నివాళులు. వారి ఆత్మకు శాంతి కలగాలి.



- చిటుకుల మైసారెడ్డి,
నెట్ వర్క్ ఇంచార్జి..



శుక్రవారం రాత్రి రాత్రి నిమ్స్ ఆసుపత్రిలో సీనియర్ పాత్రికేయులు, "ప్రతిపక్షం" పత్రికా సంపాదకులు ఫజల్ ఉల్ రహ్మాన్ గారి మృతదేహాన్ని సందర్శించి నివాళి అర్పించిన సందర్భంలో...
ఈరోజు మధ్యాహ్నం 1.30గం.లకు ఫజల్ భాయ్ అంత్యక్రియలను సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ లో జరుపుతున్నట్లు ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు.

సీనియర్ జర్నలిస్ట్ ఫజల్ రహమాన్ మృతి పట్ల మంత్రి పొన్నం సంతాపం



హుస్నాబాద్:

సీనియర్ పాత్రికేయులు 30 సంవత్సరాలుగా వివిధ పత్రికల్లో పని చేసిన మహమ్మద్ ఫజుల్ రెహమాన్ గారి ఆకస్మిక మృతి దిగ్భ్రాంతి కలిగించింది. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్న. ఫజుల్ రెహమాన్ గారి ఆత్మకు శాంతి చేకూరాలని ఆ దేవుడిని ప్రార్థిస్తున్నాను..

సంతాప సందేశం



సీనియర్ జర్నలిస్ట్, ప్రతిపక్షం దినపత్రిక సంపాదకులు మహ్మద్ ఫజల్ ఉర్ రహ్మాన్ గారి మృతికి తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత గారు ఒక ప్రకటనలో తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు తెలంగాణ స్వరాష్ట్ర సాధన ఉద్యమంలో ఆయన కీలకంగా పని చేశారని గుర్తు చేశారుఫజల్ ఉర్ రహ్మాన్ గారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.. శోఖార్తులైన ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు

ఫజల్ రహమాన్ మృతి పట్ల ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య సంతాపం..



ప్రతిపక్షం దిన పత్రిక ఎడిటర్ ఫజల్ రహమాన్ మృతి పట్ల ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య సంతాపం వ్యక్తం చేశారు. నాలుగు దశాబ్దాలకుగా ప్రజల పక్షాన నిలిచిన వ్యక్తి ఫజల్ రహమాన్ అని కొనియాడారు.



ఫజల్ రహమాన్ మృతి పట్ల మీడియా అకాడమి చైర్మన్ కే. శ్రీనివాస్ రెడ్డి, ఇజేయు మాజీ అధ్యక్షులు దేవుల పల్లి అమర్, జాతీయ కార్యదర్శి వై నరేందర్ రెడ్డి లు సంతాపం వ్యక్తం చేశారు.



సీనియర్ జర్నలిస్ట్, ప్రతిపక్షం దినపత్రిక ఎడిటర్ ఫజల్ రహమాన్ మృతి పట్ల బి ఆర్ ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ , మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి, బి ఆర్ ఎస్ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు..



మోదీ-ట్రంప్ చర్చలపై విదేశాంగ శాఖ కీలక ప్రకటన..

విదేశాంగ శాఖ కీలక ప్రకటన..అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో భారత ప్రధాని నరేంద్ర మోదీ నేరుగా మాట్లాడకపోవడమే వాణిజ్య ఒప్పందం కార్యరూపం దాల్చకపోవడానికి కారణమని అమెరికా వాణిజ్య

7



వేడెక్కుతున్న' కరేబియన్..

వెనెజువెలా నుంచి రాకపోకలు సాగించడంపై ఆంక్షలున్న నౌకలను లక్ష్యంగా పెట్టుకున్న ట్రంప్ యంత్రాంగం.. తాజాగా కరేబియన్ సముద్రంలో మరో చమురు నౌకను స్వాధీనం చేసుకుంది. 'ఒలినా' అనే నౌకను తమ ఆధీనంలోకి తీసుకున్నట్లు అమెరికా సైన్యం తెలిపింది.

7



మీ దేశంపై దృష్టి పెట్టండి

ఇరాన్‌లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా చోటుచేసుకుంటున్న అల్లర్లపై ఆ దేశ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ స్పందించారు. తమ దేశంలో ఆందోళనకారులను హెచ్చరించిన ఆయన.. విదేశీ శక్తుల చేతుల్లో కిరాయి సైనికుల్లా వ్యవహరించే వారిని సహించే ప్రసక్తే లేదన్నారు.

7



8 నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు..

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ఈ నెల 28న ప్రారంభం కానున్నాయి. కేంద్ర బడ్జెట్‌ను ఫిబ్రవరి 1న ఆదివారం ప్రవేశపెడతారు. సమావేశాల ప్రారంభ రోజైన 28న

7



సిద్దిపేట లో జరిగిన సమావేశంలో
ఎడిటర్ ఫజల్ రహమాన్ సార్ తో ప్రతిపక్షం టీమ్

ప్రతిపక్షం దినపత్రికలను ప్రజా గొంతుకగా మార్చిన ఫజల్ ఉర్ రహమాన్

- ఆయన మరణం పత్రికరంగానికి తీరని లోటు

(చిటుకుల మైసారెడ్డి, నెట్ వర్క్ ఇంచార్జి, ప్రతిపక్షం)



సీనియర్ జర్నలిస్ట్, ప్రతిపక్షం దినపత్రిక వ్యవస్థాపక సంపాదకులు ఫజల్ ఉర్ రహమాన్ మృతి జర్నలిజం రంగానికి తీరని లోటు. ముఖ్యంగా ప్రతిపక్షం దినపత్రికకు తీరని లోటు. మూడు దశాబ్దాలకు పైగా ప్రజాస్వామ్య విలువలతో, ప్రజల పక్షాన నిలబడి నిర్భయంగా కలం పట్టిన పోరాట యోధుడు ఆయన. సుమారు 30 ఏళ్ల కిందట ప్రజాతంత్ర దినపత్రికలో సిద్ధిపేట ప్రతినిధిగా ఫజల్ ఉర్ రహమాన్ జర్నలిజం ప్రస్థానాన్ని ప్రారంభించారు. ప్రజా సమస్యలనే తన అస్త్రంగా మలచుకున్నారు. ప్రజల గొంతుకను పాలకులకు గట్టిగా వినిపించాలన్న తపన ఆయన ప్రతి వార్తలోనూ, ప్రతి సంపాదకీయంలోనూ స్పష్టంగా కనిపించేది. అదే ప్రజాస్వామ్య స్ఫూర్తితో ప్రతిపక్షం దినపత్రికను ప్రజల పక్షాన నిలిచే నిర్భయ వేదికగా తీర్చిదిద్దారు. ఫజల్ ఉర్ రహమాన్ గారితో నాకు సుమారు 30 ఏళ్లుగా ఆత్మీయ అనుబంధం ఉంది. ప్రజాతంత్ర దినపత్రికలో కలిసి పని చేసిన రోజుల నుంచే ఆ అనుబంధం మరింత బలపడింది. జర్నలిజాన్ని కేవలం వృత్తిగా కాకుండా, సమాజం పట్ల బాధ్యతగా భావించిన నిజమైన విలువల జర్నలిస్ట్ ఆయన. 2024 ఫిబ్రవరి 28వ తేదీన నా జన్మదినం సందర్భంగా ఫోన్ చేసి "మిత్రమా... ప్రతిపక్షం దినపత్రిక ఎల్లవేళలా ప్రజల మధ్య ఉండాలి. నీవు ఎప్పుడూ వెన్నంటే ఉండాలి" అని చెప్పిన మాటలు నేటికీ చెవుల్లో మారు మోగుతున్నాయి. అవి నాకు మార్గదర్శక వాక్యాలుగా నిలిచాయి. ఆయన నమ్మకాన్ని నిలబెట్టే దిశగా, ప్రతిపక్షం దిన పత్రికను మరింత బలోపేతం చేయాలనే సంకల్పంతో నెట్ వర్క్ ఇన్‌చార్జిగా నా శక్తిమేరకు కృషి చేశాను. ఇకముందు కూడా అదే అంకితభావంతో ముందుకు సాగుతాను. నిమ్స్ ఆసుపత్రిలో సార్‌ను నేను, మా స్టేట్ బ్యూరోలు కత్తుల లక్ష్మారెడ్డి, ఎన్.రాంరెడ్డి, దయానంద్, సంతోష్‌లతో కలిసి చివరిసారి దర్శించుకున్నాం. ఫజల్ ఉర్ రహమాన్ గారి ఆశయాలను, ఆయన కలలను సాకారం చేసే దిశగా ప్రతిపక్షం దినపత్రిక ప్రజల పక్షంగా, ప్రజా సమస్యల గొంతుకగా నిర్భయమైన ప్రతిపక్ష స్వరంగా ముందుకు సాగుతుంది. ఫజల్ ఉర్ రహమాన్ గారి మృతి మాకు వ్యక్తిగతంగా, వృత్తిపరంగా తీరని బాధను మిగిల్చింది. వారి ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు ఈ దుఃఖాన్ని తట్టుకునే మనోధైర్యం ప్రసాదించాలని భగవంతుని ప్రార్థిస్తున్నాము. ఫజల్ ఉర్ రహమాన్ గారు భౌతికంగా దూరమైనా వారి ఆలోచనలు, ఆశయాలు ప్రతిపక్షం పేజీల్లో సజీవంగానే నిలిచి పోతాయి.

- చిటుకుల మైసారెడ్డి,
నెట్ వర్క్ ఇన్చార్జి..



జల వివాదాలు మనమే పరిష్కరించుకుందాం

- చంద్రబాబుకు రేవంత్ విజ్ఞప్తి

ప్రతిపక్షం, స్టేట్ బ్యూరో, హైదరాబాద్, జనవరి 9 :

రెండు రాష్ట్రాల మధ్య వివాదాలు ఉండకూడదనే కాంగ్రెస్ తెలంగాణ ఇచ్చిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. రాజకీయాలకు అతీతంగా నీళ్ల సమస్యను పరిష్కరించుకోవాలని చెప్పారు. కోర్టుల్లో కాకుండా.. మన సమస్యలను మనమే పరిష్కరించుకుందామని విజ్ఞప్తి చేశారు. రంగారెడ్డి జిల్లా రావిర్యాలలో సుజెన్ మెడికేర్ ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్ మాట్లాడుతూ నీళ్ల సమస్యపై స్పందించారు. జల వివాదం విషయంలో రాజకీయ ప్రయోజనం పొందాలని తమ ప్రభుత్వం ప్రయత్నించడం లేదని స్పష్టం చేశారు. ''పంచాయితీ కావాలా.. నీళ్లు కావాలా.. అని నన్ను అడిగితే తెలంగాణకు నీళ్లే కావాలని చెబుతా. వివాదాలు కావాలా.. పరిష్కారం కావాలా.. అని అడిగితే పరిష్కారం కావాలని చెబుతా. మన సమస్యలను మనమే సామరస్యంగా పరిష్కరించుకుందాం. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఈ వేదికగా ఓ విజ్ఞప్తి చేస్తున్నా. కృష్ణా నదిపై ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న ప్రాజెక్టుల అనుమతులకు అడ్డంకులు పెట్టకండి. ఇలా అడ్డంకులతో కేంద్ర ప్రభుత్వం నిధులు రావడం లేదు. రాష్ట్రంపై ఆర్థిక భారం పడుతోంది. మేం వివాదాలు కోరుకోవడం లేదు. పరిష్కారం కోరుకుంటున్నాం. రాజకీయ ప్రయోజనాలు కాదు.. ప్రజల ప్రయోజనాలు కోసం ఆలోచిస్తున్నాం. తెలంగాణకు పోర్టు కనెక్టివిటీ రావాలంటే పక్క రాష్ట్రం సహకారం ఉండాలి. రెండు రాష్ట్రాలు పరస్పరం సహకరించుకుంటేనే సమస్యలు పరిష్కారం అవుతాయి. ఏపీ, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు.. ఏ రాష్ట్రమైనా సరే మేం వివాదాలు కోరుకోవడం లేదు. ఈ విషయంలో ఏపీ సర్కారు ఒక్క అడుగు ముందుకు వేస్తే.. తెలంగాణ 10 అడుగులు ముందుకు వేస్తుంది'' అని సీఎం హామీ ఇచ్చారు.

ప్రపంచ నగరాలతో పోటీ..

'' ప్రపంచ నగరాలతో హైదరాబాద్ పోటీ పడుతోంది. సుజెన్ మెడికేర్ నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తోంది. పెట్టుబడులకు లాభం వచ్చేలా ప్రభుత్వ ప్రణాళికలు ఉన్నాయి. ప్రపంచ స్థాయి దేశాలతో తెలంగాణ పోటీ పడేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణం మన రాష్ట్రంలో ఉంది. పెద్ద కంపెనీలకు సీఈవోలుగా ఉన్నది మన దేశం వాళ్లే'' అని సీఎం అన్నారు.

జేఎన్‌జే జర్నలిస్ట్స్ భూములపై కుట్రలా?

- నిజాంపేట్, పేట్ బషీరాబాద్ లో అక్రమాలు
- నిమ్మకాయల వంశీ శ్రీనివాస్ చట్టవ్యతిరేక చర్యలు!
- కుట్రలు బట్టబయలు చేసిన సభ్యులు
- సహకార శాఖ, ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి-సభ్యులు

ప్రతిపక్షం, స్టేట్ బ్యూరో, హైదరాబాద్, జనవరి 9 :



జవహర్‌లాల్ నెహ్రూ జర్నలిస్ట్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ హైజింగ్ సొసైటీ సీఈ, కార్యదర్శిగా సుదీర్ఘంగా కొనసాగుతున్న నిమ్మకాయల వంశీ శ్రీనివాస్ చట్ట వ్యతిరేక చర్యలను సభ్యులు హైదరాబాద్ ప్రెస్ క్లబ్ వేదికగా బట్టబయలు చేశారు. 2023 లో వంశీ శ్రీనివాస్ పై చార్జిషీటు, ఎన్నికల సంఘం ద్వారా కేసు నిజం కాదా? అని ప్రశ్నించారు. 2022 సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయకుండా నిర్లక్ష్యం వహించడంలో లోగుట్టు ఏమిటి? వెయ్యి కుటుంబాల ప్రయోజనాలను ఫణంగా పెట్టి భూములను జేఎన్‌జేహెచ్‌ఎస్ సభ్యులు అనుభవించకుండా ఎందుకు కుట్రపన్నారని నిలదీశారు. ప్రభుత్వం సానుకూలంగా ఉన్నా నిజాంపేట, పేట్ బషీరాబాద్ భూములు జేఎన్‌జేహెచ్‌ఎస్ మ్యాక్ సొసైటీ సభ్యులకు దక్కనివ్వకుండా కుట్రపన్నుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఈ గందరగోళంలో నిజాంపేట్, పేట్ బషీరాబాద్ భూములను అక్రమమార్గంలో కొట్టివేయాలని కుట్రపన్నింది ఎవరు? వారికి బాసటగా నిలిచింది ఎవరు? చొరబాటు దారులకు మార్గం సుగమం చేసింది ఎవరు?

తేల్చాలని ప్రభుత్వాన్ని సభ్యులు కోరారు. నిజాంపేట్ లో భోగి కృష్ణ పేరిట మూడు ఎకరాలు, స్ట్రింగర్స్ పేరిట రెండు ఎకరాలు అక్రమణలు జరిగాయని ఆరోపించారు. పేట్ బషీరాబాద్ లో కబ్జాలు, మానేటి శ్రీనివాస్ రెండు వేల గజాలు ఆక్రమించి రెండంతస్తుల ఇళ్లు, అపర్ణ వెంచర్స్‌కు సొసైటీ భూమిలోంచి రోడ్డు, సెయింట్ ఆన్స్ పాఠశాల ఎకరంన్నర కబ్జా అంశాల్లో నిమ్మకాయల వంశీ పాత్ర అనుమానాస్పందంగా ఉందన్నారు.

ప్రభుత్వ ఖజానాకు చెల్లించగా అలాట్ అయిన భూమి అన్యాక్రాంతమైతే ఎందుకు మీ మీడియాహౌజ్‌ల ద్వారా ఆ కబ్జాలను వెల్లడించలేదని, సాటి జర్నలిస్టులకు జరుగుతున్న అన్యాయాన్ని ఎందుకు బహిర్గతం చేయడం లేదని వాపోయారు. జర్నలిస్టు సంఘాలు కూడా ఈ విషయంలో నోరు మెదపడం లేదెందుకు? ఈ దోస్తీ ఏమిటి? చార్జిషీటు తర్వాత విచారణ ఏమైంది? కంప్లయింట్ దారులు కూడా ఎందుకు మౌనం వహిస్తున్నారు? ఈ లోపాయికారీ ఒప్పందాలే తమకు శాపంగా మారాయన్నారు. చార్జ్ షీట్ నమోదై ఉన్న వ్యక్తికి ఓట్లేయమని పలు మీడియాల్లో కీలక స్థానాల్లో ఉన్నవారు ఎలా మెసేజ్ విడుదల చేశారు? అలా మెసేజ్ విడుదల చేసినందుకు గాను సొసైటీకి, సభ్యులకు జరిగిన అన్యాయానికి బాధ్యత వహిస్తారా? లేదా మీ పేర్లను మీ అనుమతి లేకుండా వంశీ శ్రీనివాస్ వాడుకున్నారా స్పష్టం చేయాలని సభ్యులు డిమాండ్ చేశారు.

సహకార శాఖ చర్యలు తీసుకోవాలి

2014నుంచి 2021 వరకు JNJHS సొసైటీకి ఎన్నికలు జరగకున్నా, జరిగినట్లుగా కమిటీ వ్యవహరిస్తే సహకార శాఖ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని సభ్యులు ప్రశ్నించారు. ప్రతి సంవత్సరం ఆడిట్ రిపోర్టులు, సభ్యుల వివరాలు ఎవరు పొందుపరిచారు? ఈ గందరగోళానికి కారణం అప్పటి ప్రభుత్వం, సంబంధిత ప్రభుత్వ శాఖలది కాదా? అన్నారు.

సుప్రీం కోర్టుకు ఎందుకు?

ఇళ్లులేని సొసైటీ సభ్యులు అఫిడవిట్లు ఇచ్చి భూములు తీసుకోవాలని 2010లో హైకోర్టు స్పష్టంగా పేర్కొన్నా, సభ్యులను సంప్రదించకుండా సుప్రీంకోర్టుకు వెళ్లారని సభ్యులు వాపోయారు. గవర్నమెంట్ మెమో నంబరు 19544 /ఏఎస్ఎస్ఎన్ 5(3) - 2011, 04-01-2012 ద్వారా తమ సొసైటీ ప్రభుత్వానికి డబ్బులు కట్టిందన్నారు. ప్రభుత్వం ఐ అండ్ పీఆర్ శాఖ ద్వారా భూములను తమ సొసైటీకి స్వాధీన పరిచినా కూడా ఎందుకు సుప్రీంకోర్టులో ఎస్ఎల్‌పీ విరమించుకోలేదు? దీని వెనుక ఉన్న మర్మమేమిటో నిమ్మకాయల వంశీ చెప్పాలన్నారు.

సీఎం రేవంత్ కు కృతజ్ఞతలు

ఈ మొత్తం యవనికలో జేఎన్‌జేహెచ్‌ఎస్ సభ్యులను కాపాడుతున్న అంశం ఒకే ఒక్కటి. అది రాష్ట్ర ముఖ్యమంత్రి 2024, సెప్టెంబర్, ఎనిమిదవ తేదీన రవీంద్రభారతిలో భారీ సభ ఏర్పాటు చేసి పేట్ బషీరాబాద్ భూముల మీద అనుభవ హక్కులను ప్రసాదిస్తూ అధికారిక పత్రాన్ని విడుదల చేశారని సభ్యులు తెలిపారు. తమకు అండగా నిలిచిన కాంగ్రెస్ సర్కారుకు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మీడియా అకాడమీ ఛైర్మన్ కే. శ్రీనివాసరెడ్డికి కృతజ్ఞతలు, ధన్యవాదాలు చెప్పారు.



సంస్కరణలతో గనుల శాఖ ఆదాయం పెరుగుతోంది: మంత్రి వివేక్

ప్రతిపక్షం, స్టేట్ బ్యూరో, హైదరాబాద్, జనవరి 9 :

రాష్ట్రంలో గనులశాఖ పలు సంస్కరణలకు శ్రీకారం చుట్టడంతో ఇటీవలి కాలంలో ఆదాయం 22% మేర పెరిగిందని రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి 2047 నాటికి తెలంగాణలో 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను నిర్మించాలనే లక్ష్యాన్ని నిర్దేశించారని, దీని సాధనలో గనుల రంగం కీలక పాత్ర పోషించనుందని పేర్కొన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించిన 'రాష్ట్రీయ ఖనిజ్ చింతన్ శివిర్ 2026' కార్యక్రమంలో కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డితో కలిసి వివేక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గనుల అక్రమ తవ్వకం, అక్రమ రవాణా, ఓవర్ లోడింగ్‌ను అరికట్టేందుకు పలు చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. తాత్కాలికంగా కొన్ని ఒత్తిళ్లు, సవాళ్లు ఎదురైనా దీర్ఘకాలంలో ఈ సంస్కరణలు బలమైన, స్థిరమైన ఫలితాలు ఇస్తాయని అన్నారు. అక్రమ మైనింగ్‌ను అడ్డుకునేందుకు జీపీఎస్ ఆధారిత వాహనాల పర్యవేక్షణ, డ్రోన్ నిఘా, ఉపగ్రహ మ్యాపింగ్ వంటి ఆధునిక సాంకేతికతలను వినియోగిస్తున్నామని చెప్పారు. చింతన్ శివిర్ నిర్వహించినందుకు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి వివేక్ కృతజ్ఞతలు తెలియజేశారు.

అశోక్‌నగర్ సెంట్రల్ లైబ్రరీకి వెళ్లగలరా?

ప్రతిపక్షం, స్టేట్ బ్యూరో, హైదరాబాద్, జనవరి 9 :

హైదరాబాద్‌లో సినిమా థియేటర్ ప్రారంభోత్సవానికి వెళ్లిన సీఎం రేవంత్‌రెడ్డి.. అశోక్‌నగర్‌లోని సెంట్రల్ లైబ్రరీకి వెళ్లగలరా? అని భారాస శాసనసభా పక్ష ఉపనేత హరీశ్‌రావు ప్రశ్నించారు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మేటలో నిర్మించిన ఆయిల్‌పామ్ కర్మాగారాన్ని ఆయన శుక్రవారం సందర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు.

'ఎన్నికల హామీలో భాగంగా సీఎం యువతకు 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామన్నారు. ఇప్పుడేమో వాటిని భర్తీ చేయక ముఖం చాటేస్తున్నారు. అందరికీ ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వడం ఎలా సాధ్యమవుతుందని మంత్రి శ్రీధర్‌బాబు అనడం హాస్యాస్పదం. ఎన్నికల సమయంలో నిరుద్యోగులను నమ్మించారు. ఇప్పుడు వంచిస్తున్నారు. సిద్దిపేట నియోజకవర్గంలోని ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ నుంచి నూనె ఉత్పత్తి అవుతోంది. కేసీఆర్ కల నిజం కావడం ఆనందంగా ఉంది. కొందరు కాంగ్రెస్ నేతలేమో తామే ఆయిల్‌పామ్ పరిశ్రమ పెట్టించామని మొండి వాదనలు చేస్తున్నారు. భారాస ప్రభుత్వ హయాంలో 2021లోనే క్యాబినెట్ ఈ నిర్ణయం తీసుకుంది. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో రైతుల పరిస్థితి అస్తవ్యస్తంగా మారింది. రెండు పంటలకు రైతుబంధు ఎగ్గొట్టారు. కాళేశ్వరం కాలువలను గజమైనా తవ్వలేదు. రూ.5 కోట్లు ఖర్చు చేస్తే 3 లక్షల ఎకరాలకు సాగు నీరు అందించవచ్చు. సిద్దిపేట నియోజకవర్గంలోనే 22 వేల మంది రైతులకు రుణమాఫీ కాలేదు' అని హరీశ్‌రావు ప్రభుత్వాన్ని విమర్శించారు.

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులందరికీ 1.02 కోట్ల రూపాయల ప్రమాద బీమా

ప్రతిపక్షం, స్టేట్ బ్యూరో, హైదరాబాద్, జనవరి 9 :

రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులందరికీ 1.02 కోట్ల రూపాయల ప్రమాద బీమాను అందుబాటులోకి తీసుకువస్తున్నట్టు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఆయన ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ఇంటింటికి చేర్చే ప్రభుత్వ ఉద్యోగులు మా కుటుంబ సభ్యులుగా సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం భావిస్తుందని వివరించారు. 1.02 కోట్ల ప్రమాద బీమాకు సంబంధించిన ప్రక్రియను అందుబాటులోకి తెచ్చేందుకు రాష్ట్రంలోని ప్రముఖ బ్యాంకర్లతో సంప్రదింపులు ముగిసినట్టు వివరించారు. ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయంగా ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ గత ప్రభుత్వంలో ఉన్న బకాయిలను సైతం ప్రతి నెల క్రమం తప్పకుండా దశలవారీగా విడుదల చేస్తూ వస్తున్నామని ఆ ప్రకటనలో వివరించారు. ఉద్యోగులకు ప్రమాద బీమాకు సంబంధించి ఇప్పటికే సింగరేణి, ట్రాన్స్కో, ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్, జెన్కో పరిధిలోని ఉద్యోగులందరికీ కోటికి పైగా ప్రమాద బీమాను అందుబాటులోకి తీసుకు వచ్చినట్టు డిప్యూటీ సీఎం తెలిపారు. ప్రభుత్వం చొరవతో చేపట్టిన కోటి రూపాయలకు పైగా ప్రమాద బీమా కార్యక్రమంతో ఇప్పటికే సింగరేణిలో 38,000 మంది రెగ్యులర్ ఉద్యోగులు వీరితోపాటు విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న 71,387 మంది ఉద్యోగులకు ప్రమాద బీమా అందుబాటులోకి తీసుకొచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ఇదే తరహాలో ప్రభుత్వ ఉద్యోగులకు సైతం 1.02 కోట్ల ప్రమాద బీమాను అమల్లోకి తీసుకు వస్తున్నట్టు తెలిపారు.



జర్నలిజం రంగంలో తీరని లోటు

పాత్రికేయ మిత్రుడు , రచయిత ఉపాధ్యాయుడు ' ప్రతిపక్షం దినపత్రిక' సంపాదకుడు మహమ్మద్ ఫజుల్ రహమాన్ (66) Mohd Fazul Rahaman ఇక లేరు. గత ఆరు రోజులుగా హైదరాబాదులో నిమ్స్ లో క్యాన్సర్ వ్యాధికి చికిత్స పొందుతున్నారు. ఆసుపత్రిలో అపస్మారక స్థితిలోనే ఉండి గంట క్రితం పరమపదించారు. ఇది చాలా విషాదకరమైన బాధాకరమైన సంఘటన.

మహమ్మద్ ఫజల్ రహ్మాన్ ఇప్పటి సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ కు చెందినవారు. 1960లో ఆయన అంతకపేటలో జన్మించారు. 1980 ప్రాంతంలో ఆంధ్రప్రభ కు హుస్నాబాద్ విలేకరిగా జర్నలిస్టు జీవితం ప్రారంభించారు. అందులో చాలా సంవత్సరాలు పనిచేశారు. అటు తరువాత హైదరాబాదులో ఆంధ్ర జ్యోతిలో పనిచేశారు. తర్వాత ' దిశ ' పత్రిక పత్రికలో ఆవిర్భావం నుంచి పని చేశారు. అటు తర్వాత ' ' ముద్ర ' పత్రికలో కొంతకాలం పనిచేసి రెండు సంవత్సరాల క్రితం తన సొంతంగా ' ప్రతిపక్షం ' దినపత్రిక ప్రారంభించి సంపాదకులుగా పనిచేస్తున్నారు. 1990 ప్రాంతంలో హుస్నాబాద్ పబ్లిక్ స్కూల్ పాఠశాల ప్రారంభించి ఎంతోమంది విద్యార్థులను తీర్చిదిద్దారు. హుస్నాబాద్ లో ప్రెస్ క్లబ్ ఆవిర్భావంలో. జర్నలిస్టు సంఘం నిర్మాణంలో హుస్నాబాద్ యూత్ అసోసియేషన్ నిర్మాణంలో, స్ఫూర్తి అసోసియేషన్లో ఆయనకు అనుబంధం ఉంది. ఫజల్ రెహమాన్ కు ముగ్గురు కుమారులు ఒక కుమార్తె ఉన్నారు.

ఆయన మృతి నాకు వ్యక్తిగతంగా బాధగా ఉంది. ఫజల్ భాయ్ కి కన్నీటి నివాళులు.



ఇటీవల జరిగిన ఢిల్లీలో విమాన సర్వీసుల రద్దుకు జీపీఎస్‌స్పూఫింగ్ కారణం. హైదరబాద్, ముంబై, బెంగళూరు, కోల్‌కతా, అమృత్‌సర్, చెన్నైల విమానాశ్రయాలకూ ఫేక్ సిగ్నల్స్ వచ్చాయి. శాటిలైట్ నావిగేషన్‌లో ఇలా జరగడంతో వెంటనే గ్రౌండ్ నావిగేషన్, సర్వైలెన్స్ యాక్టివేట్ చేశాం. ఈ సిగ్నల్స్ సోర్స్ గుర్తించే పనిలో కేంద్ర ప్రభుత్వం ఉంది.

- పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు



రాష్ట్రీయం

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ ఆసక్తి చూపాలి..

- సిద్దిపేటలో సీఎం కప్ టార్చ్ ర్యాలీ ప్రారంభం
- మంత్రి పొన్నం ప్రభాకర్



ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట జనవరి 09:

సిద్ది పేట జిల్లా ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో సీఎం కప్ టార్చ్ ర్యాలీ ఘనంగా ప్రారంభమైంది. రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ సీఎం కప్ టార్చ్‌ను వెలిగించి ర్యాలీని ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హైమవతి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి, జిల్లా యువజన క్రీడల అభివృద్ధి అధికారి వెంకట నరసయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ..విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ ఆసక్తి చూపాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీసి, వారికి సరైన శిక్షణ ఇచ్చి ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలనే ఉద్దేశంతో సీఎం కప్ కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందన్నారు. ప్రతిభావంతులైన క్రీడాకారులకు ప్రభుత్వం అన్ని విధాలా ప్రోత్సాహం అందిస్తుందని తెలిపారు.క్రీడల అభివృద్ధి కోసం తెలంగాణ ప్రభుత్వం స్పోర్ట్స్ పాలసీని అమలు చేస్తోందని, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీతో పాటు జిల్లాల్లో క్రీడల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని మంత్రి తెలిపారు. ప్రపంచ, జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన అనేక మంది క్రీడాకారులు గ్రామీణ ప్రాంతాల నుంచే వచ్చారని పేర్కొన్నారు. క్రీడల్లో రాణించిన వారికి నేరుగా గ్రూప్-1, డీఎస్పీ ఉద్యోగాలు కూడా ఇచ్చిన ఉదాహరణలు ఉన్నాయని, క్రికెటర్ సిరాజ్‌కు డీఎస్పీ ఉద్యోగం ఇచ్చిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. గ్రామ, మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో జరిగే సీఎం కప్ టోర్నీల్లో విద్యార్థులు ప్రతిభ చూపాలని ఆకాంక్షించారు. జిల్లా కలెక్టర్ హైమవతి మాట్లాడుతూ...క్రీడలు జీవితంలో ముఖ్య భాగమని, ప్రతిభ ఉన్నా అవకాశాలు అందని పిల్లల కోసం సీఎం కప్ పోటీలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని విద్యార్థులు తమకు ఇష్టమైన క్రీడల్లో రాణించాలని సూచించారు.



పద్మశాలీలు అభివృద్ధి చెందాలి...

- డా. కస్తూరి సతీష్..

ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట, , జనవరి 9:

నారాయణరావుపేట మండల కేంద్రంలో పద్మశాలి సమాజం నూతన కార్యవర్గ ప్రమాణస్వీకార మహోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా అధ్యక్షులు డాక్టర్ కస్తూరి సతీష్ హాజరై నూతన కార్యవర్గంతో ప్రమాణస్వీకారం చేయించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పద్మశాలీలు సమాజంలో ఉన్నత స్థానానికి చేరుకోవాలంటే తమ పిల్లలకు నాణ్యమైన, ఉన్నత విద్య అందించేలా తల్లిదండ్రులు కృషి చేయాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా పద్మశాలీల జనాభా సుమారు 50 లక్షల వరకు ఉందని, జనాభా ప్రాతిపదికన ప్రభుత్వ పథకాలలో తగిన నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. రాబోయే మున్సిపల్ ఎన్నికలలో అన్ని రాజకీయ పార్టీలు పద్మశాలీలకు తగిన ప్రాతినిధ్యం కల్పిస్తూ టికెట్లు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అధ్యక్షులు బల్ల సత్యనారాయణ మాట్లాడుతూ, జియో ట్యాగ్ నిబంధనలను పక్కనబెట్టి 50 సంవత్సరాలు నిండిన ప్రతి పద్మశాలి చేనేత కార్మికునికి వెంటనే పెన్షన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. బూర మల్లేశం మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా ఇప్పటివరకు ఒక్కరికి కూడా కొత్త పెన్షన్ మంజూరు చేయకపోవడం బాధాకరమని విమర్శించారు. ఇటీవల సిద్దిపేట జిల్లాలో జరిగిన సర్పంచ్ ఎన్నికలలో గెలుపొందిన పద్మశాలి సర్పంచులకు త్వరలో సన్మానం నిర్వహిస్తామని తెలిపారు.ప్రచార కార్యదర్శి ముదిగొండ శ్రీనివాస్ మాట్లాడుతూ, చేనేత సంఘాలను బలోపేతం చేయాలంటే వెంటనే క్యాష్ క్రెడిట్ సౌకర్యం కల్పించి, ప్రతి చేనేత కార్మికునికి లక్ష రూపాయల బ్యాంకు రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే చేనేత సంఘాలకు వెంటనే ఎన్నికలు నిర్వహించాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు జోగు బిక్షపతి, కోఆర్డినేటర్ వంగరి శ్రీశైలం, సహాయ కార్యదర్శులు మ్యాన లక్ష్మి నారాయణ, తాటి పాముల శ్రీనివాస్ తదితరులు పాల్గొని ప్రసంగించారు. అనంతరం జిల్లా ఆధ్వర్యంలో నారాయణరావుపేట నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. ఇందులో అధ్యక్షులుగా బల్ల సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా తుమ్మ నరేష్, కార్యదర్శిగా కూరపాటి మహేష్, కోశాధికారిగా బల్ల బాలరాజ్ నియమితులయ్యారు. గౌరవాధ్యక్షులుగా బల్ల బాల్ నర్సు, కూరపాటి శ్రీనివాస్, బల్ల వెంకటేశం, బల్ల రవీందర్, బల్ల గోపాల్‌లను అభినందించి ఘనంగా సన్మానించారు.

శ్రీ సింగరాల మల్లన్న జాతర ఏర్పాట్లను పరిశీలన!



ప్రతిపక్షం, తొగుట, జనవరి 9

తొగుట మండల కేంద్రంలోని జప్తి లింగారెడ్డిపల్లి గ్రామంలోని శ్రీ సింగరాల మల్లన్న జాతరకు జరుగుతున్న ఏర్పాట్లను గ్రామ సర్పంచ్ బక్క కనకయ్యతో మాజీ మండల పార్టీ అధ్యక్షుడు చిలివేరి మల్లారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఆదివారం రోజున సింగరాల మల్లన్న జాతర ఘనంగా నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా తగిన ఏర్పాట్లను చేస్తున్నామన్నారు. పార్టీలకు అతీతంగా స్వామివారి జాతర ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. అంగరంగ వైభవంగా గ్రామస్తులందరూ స్వామివారికి బోనాలు సమర్పించి మొక్కలు చెల్లిస్తారన్నారు. స్వామివారిని దర్శించుకోవడానికి వివిధ జిల్లాల నుండే కాకుండా వివిధ రాష్ట్రాల నుండి కూడా భక్తులు పెద్ద ఎత్తున తరలి వస్తారని తెలిపారు. స్వామివారి ఆలయం వెనకాల ఈశాన్యం భాగంలో స్వామివారి ఊట బావి ఉందని ఆ భావినీరు తాగిన వారికి అష్ట ఐశ్వర్యాలు కలుగుతున్నాయని పేర్కొన్నారు. గ్రామస్తుల సహకారం మరియు వివిధ పార్టీల నాయకులందరూ కలిసి ఆలయ అభివృద్ధికి కృషి చేయడం అభినందనీయమన్నారు. స్వామివారి ఆలయంలో రాతికడప ఉండడం వలన ఇప్పటివరకు గ్రామంలో వడగళ్ల వర్షం కురువలేదని తెలిపారు.ఈ కార్యక్రమం లో భూపాల్ రెడ్డి, యాదిరెడ్డి, సత్యనారాయణ, ఎల్లారెడ్డి,నర్సింహారెడ్డి తిరుమల్, ఆంజనేయులు,స్వామి గౌడ్,వినయ్, మహేష్, నర్సింలు, కనకయ్య తదితరులు.



సిద్దిపేట నూతన
పోలీస్ కమిషనర్‌గా ఎస్. రష్మీ పెరుమాళ్ బాధ్యతల స్వీకారం..

ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట, జనవరి 9 :

సిద్దిపేట నూతన పోలీస్ కమిషనర్‌గా ఎస్. రష్మీ పెరుమాళ్ శుక్రవారం అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ముందుగా పోలీస్ గౌరవ వందనాన్ని స్వీకరించిన అనంతరం కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారు.బాధ్యతలు స్వీకరించిన అనంతరం అడిషనల్ డీసీపీ సిహెచ్ కుశాల్కర్, ఏఆర్ అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్రబోస్, సిద్దిపేట ఏసీపీ రవీందర్ రెడ్డి, గజ్వేల్ ఏసీపీ నరసింహులు, హుస్నాబాద్ ఏసీపీ సదానందం, ట్రాఫిక్ ఏసీపీ సుమన్ కుమార్‌తో పాటు ఇతర పోలీస్ అధికారులు, కార్యాలయ సిబ్బంది కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కలు అందజేశారు.అనంతరం పోలీస్ కమిషనర్ కార్యాలయంలోని వివిధ విభాగాలను ఆయన సందర్శించి పనితీరును సమీక్షించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులతో నిర్వహించిన ఇంట్రాక్టివ్ సెషన్‌లో కమిషనర్ మాట్లాడుతూ...అందరూ సమన్వయంతో టీమ్ వర్క్‌గా పనిచేయాలని సూచించారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి మరింత సమర్థవంతమైన, మెరుగైన పోలీస్ సేవలు అందించాలన్నారు.ఈ సమావేశంలో అడిషనల్ డీసీపీ (అడ్మిన్) కుశాల్కర్, ఏఆర్ అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్రబోస్, ఏసీపీలు రవీందర్ రెడ్డి, సదానందం, నరసింహులు, సుమన్ కుమార్‌తో పాటు ఇన్స్పెక్టర్లు, సీఐలు, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ ద్వారావిశ్వతేజ కు బాల రత్న అవార్డు బహుకరణ

ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట జనవరి 09:

అతి చిన్న వయసులోనే అద్భుతమైన కథలు వ్రాసి,ఎన్నో బహుమతులు సాధించిన చిన్నకోదూరు మండలం అనంత సాగర్ ఉన్నత పాఠశాల ఏడవ తరగతి విద్యార్థి విశ్వతేజకు హైదరాబాద్ కు చెందిన కమలాకర ట్రస్ట్ వారు పంపించిన బాల రత్న అవార్డు ను శుక్రవారం రోజున పాఠశాలలో జిల్లా కలెక్టర్ హైమవతి అవార్డు బహుకరించారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు జ్యోతి, ఉపాధ్యాయులు దుర్గయ్య,శ్రీదేవి,సమ్మయ్య,కవిత,నరేష్, పర్శరాములు రమణ పాల్గొన్నారు.



సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడుగా దేవరాజు

ప్రతి పక్షం దుబ్బాక జనవరి 09:

దుబ్బాక మండల సర్పంచ్ ల ఫోరం అధ్యక్షుడుగా అచ్చుమాయపల్లి గ్రామ సర్పంచ్ పర్స దేవరాజును శుక్రవారం దుబ్బాకలో మండల సర్పంచ్ లు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసుకుని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల సర్పంచుల పోరం కన్వీనర్ గా తిమ్మాపూర్ సర్పంచ్ గుర్రాల శ్రీనివాస్, ఉపాధ్యక్షురాలుగా రాజక్కపేట సర్పంచ్ పి పద్మ వెంకటేష్, ప్రధాన కార్యదర్శిగా మాదుగుల నర్సింలు, సహాయ కార్యదర్శి గా పి. ఆంజనేయులు, కోశాధికారిగా బరిగే సుజాత నరేష్, కార్యవర్గ సభ్యులుగా ఆకారం సర్పంచ్ కాస హంస నాగభూషణం, హబ్సీపూర్ సర్పంచ్ బాలెంల శ్రీలత రాజిరెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా దేవరాజు మాట్లాడుతూ సర్పంచ్ ల మనోభావాలు దెబ్బతిన కుండా అహర్నిశలు కృషి చేస్తానన్నారు. సర్పంచ్ ల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తానన్నారు. యువ సర్పంచ్ అయిన తనకు అవకాశం ఇవ్వడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమం లో మాజీ జడ్పీటీసీ కడతల రవీందర్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ అస్క రవి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రొట్టె రాజమౌళి, పార్టీ ఉపాధ్యక్షులు గుండెల్లి ఎల్లారెడ్డి, బి ఆర్ ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు బాణాల శ్రీనివాస్ ,నాయకులు కొత్త కిషన్ రెడ్డి, తౌడ శ్రీనివాస్, లక్ష్మణ్, వరప్రసాద్, నికిల్ రెడ్డి, యాదగిరి, సంఘం ప్రభాకర్ లు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్

ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట జనవరి 09:

చిన్నకోడుర్ మండలం అనంత సాగర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో మధ్యాహ్న భోజన ప్రక్రియను జిల్లా కలెక్టర్ కె హైమావతి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అన్నం, చిక్కుడుకాయ, సాంబారు, గుడ్డు వంటలను పరిశీలించారు. కామన్ డైట్ మెనూ తప్పనిసరిగా పాటించాలని విద్యార్థుల హాజరు ప్రకారం వంట సరుకులు కొలత ప్రకారం అందించి రుచికరంగా వంటా చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపల్ మరియు ఫుడ్ చెకింగ్ టిచర్ ను ఆదేశించారు. పాఠశాల సమయ వేళల్లో విద్యార్థుల ను ఎట్టి పరిస్థితుల్లో బయటికి వెళ్లకుండా ఉపాధ్యాయులు చూసుకోవాలి. విద్యార్థుల వద్దకు వెళ్లి ఆప్యాయంగా పలకరించారు. రోజు ఆహారం రుచికరంగా ఉంటుందా, సరిపోతుందా అని ఆరా తీశారు. నాణ్యమైన ఆహార పదార్థాలను వాడుతూ రుచికరంగా వండాలని వంట సిబ్బందిని ఆదేశించారు. అనంతరం ప్రాంగణంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను జిల్లా కలెక్టర్ సందర్శించారు. అడ్మిషన్లు పెంచేలా బోధన జరపాలని పిల్లలకు టిచర్ చెప్పింది శ్రద్ధగా వినేలా బోధించాలని తెలిపారు. మెను ప్రకారం ఆహారం అందించాలని ఆదేశించారు.

నీటి మూటలు అయిన నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు

- ధైర్యం ఉంటే ముఖ్యమంత్రి అశోక్ నగర్ లైబ్రరీకి వెళ్ళాలి.
- తన్నీరు హరీశ్ రావు, మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే

ప్రతిపక్షం, నంగునూరు, జనవరి 9:



నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు నీటి మూటలయ్యాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ధైర్యం ఉంటే అశోక నగర్ లోని సెంట్రల్ లైబ్రరీకి నిరుద్యోగులకు మాట్లాడాలని మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు అన్నారు. సిద్దిపేట నంగునూరు మండలం నర్మెటలో ఆయిల్ పామ్ ప్యాక్టరీని శుక్రవారం తన్నీరు హరీశ్ రావు సందర్శించారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ వేలమంది పోలీసులను రక్షణగా పెట్టుకుని అశోక్ నగర్ లో రేవంత్ రెడ్డి సినిమా టాకీస్ ప్రారంభానికి పోతున్నాడే తప్ప నిరుద్యోగుల వద్దకు వెళ్లే ధైర్యం చేయడంలేదన్నారు. ఎన్నికలకు ముందు రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీ సెంట్రల్ లైబ్రరీకి పోయి రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చి పాటించుకోవడం లేదన్నారు. దిల్ షుఖ్ నగర్ విద్యార్థులు రోడ్ పైకి వచ్చి ధర్నా చేస్తున్నారని, అశోక్ నగర్ సెంట్రల్ లైబ్రరీకి పోయి ఇచ్చిన హామీ ఏమైందని నిలదీశారు. రేవంత్ రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే అశోక్ నగర్ సెంట్రల్ లైబ్రరీకి పోవాలని డిమాండ్ చేశారు.

కేసీఆర్ కల నిజమవడం సంతోషం

'సిద్దిపేట నియోజక వర్గం నంగునూరు మండలం నర్మెట పూర్తి స్థాయిలో పామాయిల్ నూనె ఉత్పత్తిని ప్రారంభించిందని, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కలలు నేడు నిజమవడం ఆనందంగా ఉందని హరీశ్ రావు అన్నారు. రైతులకు కేసీఆర్ ప్రభుత్వం ఎన్నో మంచి కార్యక్రమాలు చేపట్టిందన్నారు. కరోనా వచ్చినపుడు కూడా కేసీఆర్ రైతు బంధ్ అపలేదన్నారు. రైతులకు సాగు నీళ్ల బాధ లేకుండా కేసీఆర్ చేశాడన్నారు. కేసీఆర్ బిస్కెట్ల తరహాలో ట్రాన్స్ ఫార్మర్ సరఫరా చేశాడని పేర్కొన్నారు. కేసీఆర్ హయాంలో ఎరువుల కొరత లేదని చెప్పారు. వ్యవసాయ రంగాన్ని అద్భుతంగా తీర్చి దిద్దారని తెలిపారు. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో వ్యవసాయ రంగం వ్యవస్థ అస్తవ్యస్తమైందన్నారు. కాంగ్రెస్ పాలనలో కరెంట్ 12 గంటలకు మించి రావడం లేదని ఆరోపించారు.కాంగ్రెస్ యూరియా కోసం యాప్ లు తీసుకు వచ్చి రైతులను ఇబ్బందులు పెడుతోందన్నారు. కాంగ్రెస్ రైతుల ఉసురు పోసుకుంతున్నదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రెండు పంటలకు రైతు బంద్ ఎగ్గొట్టాడని అన్నారు. వానాకాలం పంట రూ.600కోట్ల బోనస్ పెండింగ్ పెట్టిందన్నారు. రెండేళ్ల లో ఒక్క గజం కాళేశ్వరం కాలువ తవ్వలేదని విమర్శించారు. రూ.అయిదు కోట్లు ఖర్చు చేస్తే కాలువల ద్వారా మూడు లక్షల ఎకరాలకు సాగునీరు ఇవ్వవచ్చన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులపై కక్షగట్టి పనిచేస్తున్నాడని విమర్శించారు. రెండేళ్లలో పంటల బీమా ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని తెలిపారు. కొంతమంది కాంగ్రెస్ నేతలు ఆయిల్ పామ్ తామే మంజూరు చేశామని అని మొండి వాదన చేస్తున్నారని విమర్శించారు. 2021 మార్చి 25 వ తేదీన ఆయిల్ పామ్ ప్యాక్టరీ పెట్టడానికి క్యాబినెట్ నిర్ణయం తీసుకుందన్నారు. 2021జూన్ 5 వ తేదీ అశ్వారావు పేట నుండి ఆయిల్ పామ్ మొక్కను తెచ్చి ఇక్కడ నాటినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం సిద్దిపేట జిల్లాలో 14,075ఎకరాల ఆయిల్ పామ్ తోట సాగవుతోందన్నారు. నర్మెటలో 65 ఎకరాల్లో రూ.300 కోట్ల అంచనాలతో 2022 ఏప్రిల్ 13 వ తేదీన ఫ్యాక్టరీకి శంకుస్థాపన చేశామన్నారు. ఇప్పటి వరకు 3500 టన్నుల క్రషింగ్ జరుగుతోందని చెప్పారు. సిద్దిపేటకు గోదావరి జలాలలను సిద్దిపేటకు తీసుకురావాలన్న 40 ఏళ్ల కల కాళేశ్వరం ప్రాజెక్టుతో నెరవేరిందన్నారు. ప్రాజెక్టు వల్ల సిద్దిపేట జిల్లాలో ఎనిమిది వేల ఎకరాల నుండి 80 వేల ఎకరాలకు వరి సాగు విస్తీర్ణం పెరిగిందని చెప్పారు. నర్మెటలోని ఆయిల్ పామ్ ఫ్యాక్టరీలో రిఫైనరీ ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం 600 మెట్రిక్ టన్నుల క్రూడ్ పామ్ ఆయిల్ వస్తుందని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దేవుడి మీద ఒట్టు పెట్టి సగం మందికి కూడా రుణమాఫీ చేయలేదన్నారు. సిద్దిపేట నియోజకవర్గంలో 22 వేల మందికి రుణమాఫీ కాలేదన్నారు. రేవంత్ రెడ్డి జేబులో కత్తెర పెట్టుకొని తిరుగుతున్నాడని, నర్మెటలో ఫ్యాక్టరీ ప్రారంభించడానికి వస్తే సిద్దిపేట నియోజకవర్గంలో 22 వేల మంది రైతులకు రుణ మాఫీ కావాలని అడుగుతానన్నారు. 22 వేల మంది రుణ మాఫీ కానీ రైతులతో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ వద్దకు వచ్చి, రుణ మాఫీ చేసే దాక రైతులతో ఇక్కడే కూర్చుంటామన్నారు. కేసీఆర్ కట్టిన వాటిని రేవంత్ రెడ్డి ప్రారంభిస్తూ అభివృద్ధిలో ఉన్న పనులు ఆపుతున్నాడని విమర్శించారు. ఈ కార్యక్రమంలో వేలేటి రాధాకృష్ణ శర్మ, వేముల వెంకటరెడ్డి, రాగుల సారయ్య, జాప శ్రీకాంత్ రెడ్డి, ఎడ్ల సోమిరెడ్డి, శ్రీహరి, దువ్వల మల్లయ్య,ఎల్లంకి మహిపాల్ రెడ్డి, కోల రమేశ్ గౌడ్, బద్దిపడగ కిష్టారెడ్డి, శనిగరం బాబు, బెదురు తిరుపతి, నిమ్మ శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే హరీష్ రావు..

ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట జనవరి 09:




మన పండగలు, మన సంస్కృతిని భావి తరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్‌రావు అన్నారు.సిద్దిపేట పట్టణం వివేకానంద కాలనీలోని శారదా నీకేతన్ స్కూల్‌లో కౌన్సిలర్ ధర్మ వరం బ్రహ్మం ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... కౌన్సిలర్ బ్రహ్మం ఎంతో అద్భుతంగా సంప్రదాయాలను ప్రతిబింబించే కార్యక్రమాన్ని నిర్వహించారని ప్రశంసించారు.చిన్నపిల్లల బోడ పండ్లు, బోగి మంటలు, ఆడపడుచుల రంగురంగుల ముగ్గులు, యువత కోసం పతంగుల పండుగ వంటి కార్యక్రమాలు ఒకే వేదికపై నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇలాంటి వేడుకల ద్వారా నేటి తరం పిల్లలకు మన పండగల ప్రాముఖ్యత, సంప్రదాయాలు తెలిసే అవకాశం ఉంటుందన్నారు.ముందస్తుగా సంక్రాంతి వేడుకలు నిర్వహించిన నిర్వాహకులను అభినందిస్తూ, కార్యక్రమంలో పాల్గొన్న అందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ముగ్గుల పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు.



ధర్మారంలో వారాంతపు సంత ప్రారంభించిన సర్పంచ్

ప్రతిపక్షం మిడిదొడ్డి జనవరి 9

ప్రజా అభిప్రాయాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు నిర్వహించడం జరుగుతుందని సర్పంచ్ శ్రీనివాస్ అన్నారు. సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం ధర్మారం గ్రామంలో కూరగాయల మార్కెట్ను గ్రామపంచాయతీ పాలకవర్గంతో కలిసి సర్పంచ్ శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామంలో కూరగాయల వారాంతపు సంత ఏర్పాటు చేయాలని గ్రామస్తులు విన్నవించడంతో, నేడు కూరల మార్కెట్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రతి శుక్రవారం గ్రామంలో కూరగాయల మార్కెట్ కొనసాగుతుందని తెలిపారు. మార్కెట్ నిర్వహణకు సహకరించిన రైతులకు, గ్రామస్తులకు కృతజ్ఞతలు తెలిపారు. మార్కెట్లో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో సహకరిస్తామని రైతులకు భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామస్తులు పలువురు పాల్గొన్నారు.



తూర్పుగోదావరి జిల్లా రాయవరంలో పర్యటించిన సీఎం చంద్రబాబు రైతులకు పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ చేశారు. అనంతరం ప్రజావేదికలో సభలో పాల్గొని మాట్లాడారు. రైతుల భూమి పత్రాలపై జగన్ ఫొటో ఎందుకు వేశారో అర్థం కాలేదని అన్నారు. గత ప్రభుత్వ నేతలవి ప్రమాదకరమైన ఆలోచనలని 'మీ భూమి - మీ హక్కు' అని ఎన్నికల ప్రచారంలోనే తాము చెప్పినట్లు గుర్తు చేశారు. రాజముద్ర వేసి పాస్‌బుక్‌లు ఇస్తామని హామీ ఇచ్చామని, దాన్ని ఇప్పుడు నెరవేర్చామని సీఎం తెలిపారు.

- సీఎం చంద్రబాబు

రాజకీయం



మల్లన్న ఆలయంలో చోరీ కేసును చేదించిన పటాన్ చెరు పోలీసులు

- పోచారం తాళ్ళ మల్లన్న ఆలయంలో తాళాలు పగులగొట్టి, వెండి ఆభరణాల దొంగతనం
- ఆరు కిలోల వెండి ఆభరణాలు
- పోచారం శివారులో ఈనెల 6న ఘటన.
- వివిధ పోలీస్ స్టేషన్లో నిందితుడిపై 33 పాత కేసులు
- నిందితుడి అరెస్టు.
- రామచంద్రాపురం ఏసిపి శ్రీనివాస్ కుమార్ మీడియా సమావేశం లో వెల్లడి



ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, జనవరి 09 :

తాళ్ళ మల్లన్న ఆలయంలో తాళాలు పగులగొట్టి, వెండి ఆభరణాల దోసుకెళ్లిన దొంగను పటాన్ చెరు పోలీసులు చాక్యచక్యంగా మూడు రోజుల్లోనే పట్టుకున్నారు. శుక్రవారం సాయంత్రం పటాన్ చెరు పోలీస్ స్టేషన్లో రామచంద్రాపురం ఏసిపి శ్రీనివాస్ కుమార్ కేసు వివరాలను వెల్లడించారు. పటాన్‌చెరు పట్టణం గొల్లబస్తి కి చెందిన దండు రవి (44) అనే పాత నేరస్థుడు. గత కొంతకాలంగా వరుస దొంగతనాలకు పాల్పడుతున్నాడు. ఈ క్రమంలోనే గత నెల 30న రామచంద్రపురం పరిధిలో ఒక స్కూటీని దొంగిలించిన రవి. మండలంలోని పోచారం శివారు లో ఈ నెల నాలుగు నుంచి ఆరు వరకు కొనసాగిన తాళ్ల మల్లన్న ఆలయం జాతర చివరి రోజు మధ్య రాత్రి ఆలయంలోకి చొరబడి ఆలయంలో ఉన్న వెండి కిరీటాలు, హారాలు, నాగ పడగ వంటి (12 వస్తువులు) 6 కిలోల వెండి ఆభరణాలు దొంగిలించుకొని పోయాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు శుక్రవారం ఉదయం 10 గంటల సమయంలో పటాన్‌చెరు మార్కెట్ రోడ్డులో నంబర్ ప్లేట్ లేని స్కూటీపై అనుమానాస్పదంగా తిరుగుతున్న రవిని, ఎస్సై ఆసిఫ్ అలీ , సిబ్బంది అంజయ్య, సుకేష్ రెడ్డిలు గుర్తించారు. పోలీసులను చూడగానే పారిపోయేందుకు ప్రయత్నించిన నిందితుడిని వెంబడించి పట్టుకున్నారు. స్కూటీ డిక్కిని తనిఖీ చేయగా దొంగిలించిన వెండి ఆభరణాలు బయటపడ్డాయి. నిందితుడుని పోలీస్ స్టేషన్ కు తరలించి తమదైన శైలిలో విచారించగా తను చేసిన నేరాలను ఒప్పుకున్నాడు. దండు రవిపై 2008 నుండి ఇప్పటివరకు వివిధ పోలీస్ స్టేషన్ పరిధిలో 30 కేసులు నమోదైనట్లు చెప్పారు.జల్సాలకు అలవాటు పడి దొంగతనాలకు పాల్పడినట్లు నిందితుడు అంగీకరించాడు. నిందితుడి నుంచి 6 కిలోల వెండి ఆభరణాలతో పాటు స్కూటీని స్వాధీనం చేసుకొని రిమాండ్ కు తరలించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐ వినాయక్ రెడ్డి, క్రైమ్ సీఐ రాజు, ఎస్సైలు ఆసిఫ్ అలీ, మహేశ్వర్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.





అర్ధ రాత్రి దాటాక కొల్లూరు పోలీస్ స్టేషన్ పరిధిలో కోట్ల విలువైన 9 ఎకరాల భూమి ఖబ్జాకు యత్నం


- ఖబ్జాకు యత్నించ్చిన 200 మంది.
- పోలీస్ ల అదుపులో 30 మంది.
- వాచ్మెన్ ను చంపుతామని బెదిరింపులు.

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, జనవరి 09 :

రాత్రికి రాత్రే కోట్ల రూపాయల విలువ చేసే ప్రైవేటు భూమిని కబ్జా చేసేందుకు భారీగా చేరుకున్న గుర్తు తెలియని వ్యక్తులు వాహనాల్లో వచ్చి చెట్లను,ప్రహరీ గోడను తొలగించి కంచె వేసేందుకు ప్రయత్నించారు. సెక్యూరిటీ గార్డులను కిడ్నాప్ చేసి, వాచ్ మెన్ దంపతులను చంపేస్తామని బెదిరించి దాడి చేశారు. సైబరాబాద్ పరిధిలోని సంగారెడ్డి జిల్లా కొల్లూరు పోలీస్ స్టేషన్ పరిధిలో తొమ్మిది ఎకరాలకు పైగా ప్రైవేటు భూమిని కబ్జా చేసేందుకు యత్నించారు. రాత్రి 9 గంటలకు 200 మంది జి. మాదవి, భర్త: భగవంత్ రెడ్డి కి చెందిన సర్వే నంబర్ 192/ఆ9/అ లోని 5.12 గుంటల భూమి, చదలవాడ శ్రీనివాస్ కు చెందిన 4 ఎకరాలలో ఏషియన్ టింబర్ డిపో స్థలానికి చేరుకున్నారు. మాధవికి చెందిన ప్రైవేటు భూమిలో ఉన్న టేకు చెట్లను, వెదురు చెట్లను నరికేసి కంటైనర్ ను ఏర్పాటు చేశారు. శ్రీనివాస్ కు చెందిన టింబర్ డిపో ప్రహరీ గోడను జేసీబీలతో తొలగించారు. రేలింగ్ పైపులు, నేమ్ బోర్డులతో డీసీఎం వ్యాను, ట్రాలీ ఆటో వాహనాలలో వచ్చారు. అక్కడే ఉన్న ముగ్గురు సెక్యూరిటీ గార్డులను కిడ్నాప్ చేసి నార్సింగి వద్ద వదిలిపెట్టారు. వాచ్ మెన్ రూంలోకి వెళ్లి దంపతులను చంపేస్తామని బెదిరిస్తూ దాడి చేశారు. సెక్యూరిటీ గార్డులోని ఓ వ్యక్తి ఫోన్ ద్వారా సూపర్ వైజర్ కు సమాచారం ఇవ్వడంతో కొల్లూరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. రాత్రికి రాత్రే దాదాపు 20 మంది మహిళలు, ,12 మంది పురుషులను కొల్లూరు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కొల్లూరు సీఐ గణేష్ పటేల్ ఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని అన్నారు.

ఇందూరుగా నిజామాబాద్ పేరును మారుస్తాం

- బల్దియాలో తీర్మాణం చేసి ప్రభుత్వానికి పంపడం ఖాయం
- కవిత పార్టీకి సీఎం రేవంత్ ఫండ్
- నిజామాబాద్ ఎంపి ధర్మపురి అర్వింద్



ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, జనవరి 09 :

వచ్చే మున్సిపల్ ఎన్నికలలో నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పై బీజేపీ జెండా ఎగుర వేస్తుందని, ఆ మరుక్షణమే నిజామాబాద్ పేరును ఇందూరుగా మారుస్తామని ఎంపీ అర్వింద్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంపీ మాట్లాడుతూ జిల్లా పేరు మార్పు డిమాండ్ ఎప్పటి నుంచో ఉందని, గత ఎన్నికల్లో మున్సిపల్ పీఠం కొంతలో చేయి జారిందన్నారు. ఈసారి మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో గెలుపు బీజేపీదేనని ఎంపీ ధీమా వ్యక్తం చేశారు. నిజాం కు ముందు ఇందూర్ పేరు ఉండే త్వరలోనే అపేరును పెట్టితీరుతాం అన్నారు. ఎన్నో పథకాలు కేంద్రం నుంచి వస్తున్నాయని, రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి అభివృద్ధి చేయడం లేదన్నారు. పనిచేయని ప్రభుత్వాలకు ఓటు వేయొద్దన్నారు. గత పదేళ్లలో నగరంలో ఎటువంటి అభివృద్ధి జరగలేదని గుర్తు చేశారు. గ్రామాభివృద్ధి కోసమే జీ రాం జీ ఉపాధి హామీ పథకం మార్పు జరిగినట్టు ఎంపీ తెలిపారు. గ్రామ అభివృద్ధి కోసం చట్టాన్ని రూపొందించారని, దీనిని వ్యతిరేకించడం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ కు బీజేపీతోనా ? రాముడితోనా లేదా, కేంద్ర ప్రభుత్వంతోనా ఇబ్బంది అనేది స్పష్టం చేయాలని ఎంపీ డిమాండ్ చేశారు. గతంలో వంద రోజులు పని రోజులు ఉంటే దానిని 125 రోజులకు పెంచామన్నారు. ప్రధానంగా ఆదివాసీలకు ఎస్టీలకు మరిన్ని రోజులు పెంచే అవకాశం ఉందన్నారు. నూతన చట్టంతో ప్రతివారం నేరుగా వారి ఖాతాలో డబ్బులు జమ అవుతాయని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం మీద బాధ్యత ఉండేందుకు 40 శాతం నిధులు కేటాయించేలా చట్టం రూపొందించామన్నారు. పనిచేయని ప్రభుత్వాలకు ఈ చట్టం ఇబ్బందికరంగా ఉందన్నారు. వ్యవసాయ పనులకు సైతం ఉపాధి హామీ కింద పనిచేసుకోవచ్చని వివరించారు. నిరుద్యోగులకు ఈ పథకం ఉపాధినిస్తుందని చెప్పారు. గ్రామ అభివృద్ధికి నిరుద్యోగులకు ఉపయోగపడే పథకంపై రాజకీయాలు చేయొద్దని కోరారు. పథకంపై జీవో వచ్చిన రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం తగదన్నారు. ఈ సమావేశంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి, జిల్లా ప్రధాన కార్యదర్శి నాగోల్ల లక్ష్మీనారాయణ, మాజీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

మున్సిపల్ ఎన్నికలకు సన్నద్ధమవుతున్న భారత రాష్ట్ర సమితి

- వరుసగా జిల్లాల వారీగా సన్నాహక సమావేశాలు నిర్వహిస్తున్న వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- 24 నెలల కాంగ్రెస్ మోసం, పాలన వైఫల్యంపై రాష్ట్ర ప్రజానీకం ఆగ్రహంతో ఉన్నది
- రెండు సంవత్సరాలు పట్టణాల్లో ఒక్క రూపాయి కూడా కాంగ్రెస్ ఖర్చు చేయలేదు
- పంచాయతీ ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్ పాలన తిరస్కరించాయి
- పంచాయతీ ఎన్నికల ఫలితాల స్ఫూర్తితో మున్సిపల్ ఎన్నికలలో విజయకేతనం ఎగురవేయాలి
- జిల్లాలోని పార్టీ మున్సిపాలిటీ వారీగా పార్టీ నేతలకు దిశా నిర్దేశం చేస్తున్న కేటీఆర్
- హైదరాబాదులో ఈరోజు కరీంనగర్ ఉమ్మడి జిల్లా నేతలతో సమావేశం
- నిన్న వరంగల్, రేపు ఖమ్మం నిజామాబాద్ జిల్లాల వారీగా సమావేశం నిర్వహించనున్న కేటీఆర్



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, జనవరి 9:

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ దిశానిర్దేశం మేరకు వచ్చే మున్సిపల్ ఎన్నికలకు పార్టీని సన్నద్ధం చేసే ప్రక్రియకు వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శ్రీకారం చుట్టారు. వరుసగా జిల్లాల వారీగా మున్సిపల్ ఎన్నికల సమావేశాలను నిర్వహిస్తున్నారు. నిన్న వరంగల్ జిల్లాతో పాటు నేడు కరీంనగర్ జిల్లాకు సంబంధించిన జిల్లా అధ్యక్షులు, ప్రజాప్రతినిధులతో ముఖ్య నేతలతో ప్రత్యేకంగా సమావేశమై వచ్చే పురపోరులో పార్టీ అనుసరించాల్సిన వ్యూహం గురించి విస్తృతంగా చర్చించారు. ఇటీవల పంచాయతీ ఎన్నికల్లో అధికార పార్టీ ఎన్ని ప్రలోభాలకు గురిచేసినా, అడ్డదారులు తొక్కినా 4000 పైచిలుకు గ్రామ పంచాయతీలు బి ఆర్ ఎస్ గెలవడం రాష్ట్రంలో మారుతున్న రాజకీయ ముఖచిత్రానికి స్పష్టమైన సంకేతమని కేటీఆర్ అన్నారు. 24 నెలల కాంగ్రెస్ ప్రభుత్వ మోసాన్ని, అన్ని రంగాల్లో కుప్పకూలిన పరిపాలనకు వ్యతిరేకంగా తెలంగాణ ప్రజానీకం కాంగ్రెస్ పార్టీ పైన తీవ్ర ఆగ్రహంతో ఉన్నదని ఈ సందర్భంగా కేటీఆర్ అన్నారు. రేవంత్ చేతకాని పాలనతో ప్రజలు పూర్తిగా విసిగిపోయారని చెప్పడానికి ఈ ఫలితాలే ప్రత్యక్ష సాక్ష్యమని, వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీకి ఇంతకన్నా పెద్ద ఎదురుదెబ్బ తప్పదని కేటీఆర్ స్పష్టం చేశారు. కేవలం రెండు సంవత్సరాల్లోనే అధికార పక్షంపైన ఇంత తీవ్రమైన వ్యతిరేకత రావడం ఎప్పుడూ చూడలేదని కేటీఆర్ అన్నారు. అసెంబ్లీ ఫలితాలు అనంతరం మన పార్టీ అనేక సవాలను ఎదుర్కొని, పార్లమెంట్ ఎన్నికల్లో ఓటమిని దాటుకొని...కాంగ్రెస్ ప్రభుత్వం పైన నిరంతర పోరాటం చేస్తూ మరోసారి ప్రజల మనసును చురగొన్నదని కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ పాలనతో విసిగిపోయిన ప్రజలు బిఆర్ఎస్ వైపు చూస్తున్నారన్నారు. పంచాయతీ ఎన్నికల ఫలితాలు ఇచ్చిన స్ఫూర్తితో మున్సిపల్ ఎన్నికలకు సర్వసన్నద్ధం కావాల్సిన సమయం ఆసన్నమైందని కేటీఆర్ పిలుపునిచ్చారు. ప్రజలు కాంగ్రెస్కు వ్యతిరేకంగా ప్రజలు మన పంచాయతీ ఎన్నికల్లో ఓటు వేశారని, మరోసారి రాష్ట్ర ప్రజానీకం పల్లెలు పట్టణాలకు అతీతంగా మన పార్టీ వైపు చూస్తున్నారని కేటీఆర్ అన్నారు. పార్టీ శ్రేణులంతా శక్తి వంచన లేకుండా గులాబీజెండాకు పూర్వ వైభవం తెచ్చేందుకు సరిహద్దుల్లో పనిచేసే సైనికుల్లాగా పనిచేయాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ ఎన్నికల సందర్భంగా గత 24 నెలలుగా పట్టణాల్లో నెలకొన్న సమస్యలను ప్రజల ముందు ఉంచాలని కేటీఆర్ పార్టీ నేతలను కోరారు. పారిశుధ్యం నుంచి మొదలుకొని వీధిదీపాల వరకు అన్ని అంశాల్లో కాంగ్రెస్ పార్టీ చేతులెత్తేసిందని కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం, రేవంత్ పాలనలో పట్టణాల్లో కొత్తగా ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదని, మున్సిపాలిటీలు సమస్యలకు కేరాఫ్ గా మారాయని మండిపడ్డారు. గతంలో బి.ఆర్.ఎస్ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన నిధులకు పనులకు తిరిగి శిలాఫలకాలు వేయడం తప్పించి రెండు సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీ చేసిన ఒక్క పని కూడా లేదన్నారు. సుమారు దశాబ్ద కాలం పాటు బి ఆర్ ఎస్ హయంలో పట్టణ ప్రగతితో పురపాలికల రూపురేఖలు మారిపోయాయని, ప్రతి మున్సిపాలిటీని గ్రోత్ ఇంజన్లుగా తీర్చిదిద్దామని గుర్తు చేశారు. పట్టణ ప్రగతితో పాటు ప్రతి మునిసిపాలిటీలో అవసరమైన అనేక అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేశామని, వీటిని ప్రజలకు గుర్తు చేయాలన్నారు. శుక్రవారం హైదరాబాద్లో జరిగిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశంలో జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులు, జిల్లా అధ్యక్షులు, ముఖ్య నేతలు హాజరయ్యారు. కరీంనగర్ భారత రాష్ట్ర సమితి కోట అని, రెండున్నర దశాబ్దాలుగా అన్ని ఎన్నికల్లో పార్టీ వెంట కరీంనగర్ ప్రజానీకం నిలబడ్డారన్నారు. ఈ సందర్భంగా పార్టీ నేతలు తమ పరిధిలో ఉన్నటువంటి మునిసిపాలిటీలు కార్పొరేషన్ లో పార్టీపరంగా ఉన్న మున్సిపల్ ఎన్నికల సన్నద్ధతను తెలియజేశారు. ఇప్పటికే ప్రతి వార్డు డివిజన్ వారీగా మున్సిపల్ ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లు చేసుకుంటున్నట్లు నేతలు కేటీఆర్ కి తెలియజేశారు. ఈ సందర్భంగా కరీంనగర్ జిల్లాలో మున్సిపల్ ఎన్నికలకు సంబంధించిన పలు అంశాల పైన కేటీఆర్, నేతలకు దిశా నిర్దేశం చేశారు.

నాణ్యమైన మౌలిక సదుపాయాలకు వెన్నెముకగా మెట్రాలజీ

- గీతం ఆతిథ్య ఉపన్యాసంలో జాతీయ భౌతిక ప్రయోగశాల డైరెక్టర్ ప్రొఫెసర్ ఆచంట వేణుగోపాల్



ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, జనవరి 09 :

ఒక దేశం యొక్క నాణ్యమైన మౌలిక సదుపాయాలకు వెన్నెముకగా మెట్రాలజీ నిలుస్తోందని జాతీయ భౌతిక ప్రయోగశాల (సీఎస్ ఐ ర్ -ఎన్పిల్) డైరెక్టర్ ప్రొఫెసర్ ఆచంట వేణుగోపాల్ చెప్పారు. హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, భౌతిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'క్వాంటం టెక్నాలజీలకు క్వాంటం మెట్రాలజీ, మెట్రాలజీ' అనే అంశంపై శుక్రవారం ఆయన ఆతిథ్య ఉపన్యాసం చేశారు. విస్తరిస్తున్న క్వాంటం టెక్నాలజీల అభివృద్ధిలో ఖచ్చితత్వ కొలత యొక్క కీలక పాత్ర, ఈ సాంకేతికతల భవిష్యత్తులో అందివచ్చే విస్తారమైన ఉపాధి అవకాశాలను డాక్టర్ వేణుగోపాల్ వివరించారు. భారతదేశంలో క్వాంటం టెక్నాలజీలను అభివృద్ధి చేయడానికి, ముందుకు తీసుకెళ్లడానికి మరిన్ని ప్రయత్నాలు అవసరమని ఆయన స్పష్టీకరించారు. జాతీయ భౌతిక ప్రయోగశాల, దాని జాతీయ బాధ్యతలు, క్షిపణుల నుంచి అంతరిక్షం వంటి వ్యూహాత్మక రంగాల వరకు ఈ సంస్థ సహకారంపై సమగ్ర అవలోకనాన్ని అందించారు. అకౌస్టిక్ గ్యాస్ థర్మోమెట్రీ, సీఎస్‌ఫౌంటెన్ అటామిక్ క్లాక్, భారత ప్రామాణిక సమయం (ఐఎస్ టీ) యొక్క నిరంతర నిర్వహణతో సహా ఎన్‌పీఎల్ లోని అత్యాధునిక సౌకర్యాలను కూడా ఆయన వివరించారు. జాతీయ మెట్రాలజీ సంస్థల ప్రపంచ నెట్ వర్కు గురించి చెబుతూ, శాస్త్రీయ, సాంకేతిక పురోగతికి గుర్తించదగిన, అధిక ఖచ్చితత్వ కొలతలు అవసరమని చెప్పారు. భవిష్యత్తు మెట్రోలజీ వినియోగంలో నానోఫోటోనిక్స్ యొక్క ప్రాముఖ్యత, వీటి మూలాలు, వాటిని కనిపెట్టే పరికరాల కోసం సింగిల్‌ఫోటాన్ మెట్రాలజీ, లేబుల్‌ఫ్రీ సింగిల్ మాలిక్యూల్ డిటెక్షన్, ఇంటిగ్రేటెడ్ క్వాంటం సర్క్యూట్ల కోసం సిన్ & లనోయ్ ప్లాట్‌ఫారమ్ ల సామర్థ్యాన్ని పెంచడం అవశ్యమని ఆయన పేర్కొన్నారు.తొలుత, గీతం విశిష్ట ఆచార్యుడు ప్రొఫెసర్ బీ.వీ.ఆర్. టాటా వక్తను పరిచయం చేయగా, స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రెజా, భౌతికశాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ టి.విశ్వం తదితరులు అతిథిని సత్కరించారు. ఈ ఆతిథ్య ఉపన్యాస కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు హాజరై, సందేహాలను అడిగి తెలుసుకున్నారు.

చరిత్ర కలిగిన సికింద్రాబాద్ పేరును రూపు మాపేందుకు సీఎం కుట్రలు

- మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆగ్రహం

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, జనవరి 9:



ఎంతో చరిత్ర కలిగిన సికింద్రాబాద్ పేరును రూపు మాపేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుట్రలు చేస్తున్నారని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం వెస్ట్ మారేడ్ పల్లిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సికింద్రాబాద్, ముషీరాబాద్ ఎమ్మెల్యేలు పద్మారావు గౌడ్, ముఠా గోపాల్, మాజీ కార్పొరేషన్ ఛైర్మన్ గజ్జెల నగేష్, పలువురు కార్పొరేటర్ లు, కంటోన్మెంట్ బోర్డ్ మాజీ సభ్యులు, పలు వ్యాపార, వాణిజ్య, కార్మిక సంఘాల ప్రతినిధులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ సికింద్రాబాద్ ప్రాంత ప్రజల అభిప్రాయాలను తెలుసుకోకుండా, ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల ను సంప్రదించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం నియంతృత్వ ధోరణికి నిదర్శనమని మండిపడ్డారు. ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ ప్రజలను అనేక ఇబ్బందులకు గురి చేస్తుందని ధ్వజమెత్తారు. డివిజన్ ల విభజన కూడా క్షేత్రస్థాయిలో పర్యటించకుండా ఆఫీస్ లలో కూర్చొని గూగుల్ మ్యాప్ ల ఆధారంగా ఏర్పాటు చేశారని వివరించారు. 150 డివిజన్ లు ఉంటే 300 కు పెంచి హైదరాబాద్, మల్కాజ్ గిరి, సైబరాబాద్ పేరుతో మూడు మున్సిపల్ కార్పోరేషన్ లను ఏర్పాటు చేయాలని రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు చేపడుతుందని తెలిపారు. సికింద్రాబాద్ పేరుతో మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటు చేసే వరకు దశల వారీగా అనేక ఆందోళన కార్యక్రమాలు అహింసా మార్గంలో నిర్వహిస్తామని చెప్పారు. ముందుగా ఈ నెల 11 వ తేదీన ఉదయం 11 గంటలకు బాలం రాయ్ లోని లీ ప్యాలెస్ లో సమావేశం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. సికింద్రాబాద్ ప్రాంత ప్రజల ఆత్మగౌరవం, చరిత్ర, సంస్కృతి ని కాపాడుకునేందుకు జరిపే పోరాటానికి కలిసొచ్చే అన్ని రాజకీయ పార్టీలు, అన్ని వ్యాపార, వాణిజ్య, కార్మిక, కుల సంఘాలు, ఉద్యమ సంఘాల ప్రతినిధులు, సికింద్రాబాద్ ప్రాంతానికి చెందిన ప్రతి ఒక్కరూ ఈ సమావేశానికి హాజరు కావాలని పిలుపునిచ్చారు. 11 వ తేదీన నిర్వహించే సమావేశంలో భవిష్యత్ కార్యాచరణ పై చర్చించనున్నట్లు తెలిపారు. 17 వ తేదీన సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుండి క్లాక్ టవర్, ప్యాట్నీ, ప్యారడైజ్, సర్కిల్ ల మీదుగా MG రోడ్ లోని మహాత్మాగాంధీ విగ్రహం వరకు 10 వేల మందితో భారీ ర్యాలీ నిర్వహిస్తామని తెలిపారు. ఆ తర్వాత సికింద్రాబాద్ స్టేషన్ ను ముట్టడిస్తామని చెప్పారు. అవసరమైతే బంద్ లు, ధర్నాలు నిర్వహిస్తామని చెప్పారు. అప్పటికి ప్రభుత్వం స్పందించకపోతే సెక్రెటరీయేట్ ను ముట్టడిస్తామని హెచ్చరించారు. ముఖ్యమంత్రి కి దమ్ము ఉంటే హైదరబాద్ పేరు మార్చాలని సవాల్ చేశారు. 220 సంవత్సరాలకు పైగా చరిత్ర కలిగిన సికింద్రాబాద్ పేరుతో కాకుండా వేరొక పేరుతో కార్పోరేషన్ ఏర్పాటు చేస్తామంటే ఊరుకునే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. మీడియా సమావేశంలో కార్పొరేటర్ లు కోలన్ లక్ష్మీ, టి.మహేశ్వరి, కూర్మ హేమలత, సామల హేమ, ప్రసన్నలక్ష్మి, కంది శైలజ, రాసూరి సునీత, మాజీ కార్పొరేటర్ నామన శేషకుమారి, లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షుడు గుర్రం పవన్ కుమార్ గౌడ్, ప్రధాన కార్యదర్శి శాదం బాలరాజ్ యాదవ్, బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు కోలన్ బాల్ రెడ్డి, అత్తిలి శ్రీనివాస్ గౌడ్, ఆకుల హరికృష్ణ, శ్రీనివాస్ గౌడ్, వెంకటేశన్ రాజు, నాయకులు తలసాని స్కై లాబ్ యాదవ్, నాగులు, కిషోర్ కుమార్, శ్రీహరి, నరేందర్, మహేష్ కుమార్ యాదవ్, ఆంజనేయులు, శేఖర్ తదితరులు ఉన్నారు.

పలు సంఘాల మద్దతు

సికింద్రాబాద్ మున్సిపల్ కార్పోరేషన్ ఏర్పాటు కోసం నిర్వహించే పోరాటానికి తమ సంపూర్ణ మద్దతు ను తెలుపుతూ పలు సంఘాల ప్రతినిధులు తమ తీర్మాణాలను ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్ యాదవ్, పద్మారావు గౌడ్ లకు అందజేశారు. శుక్రవారం వెస్ట్ మారేడ్ పల్లి లోని తన క్యాంప్ కార్యాలయంలో తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యం లో ఏర్పాటు చేసిన సమావేశానికి సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలోనే కాకుండా కంటోన్మెంట్ నియోజకవర్గ పరిధిలోని సుమారు 35 కు పైగా వ్యాపార, వాణిజ్య, కార్మిక, కుల సంఘాల ప్రతినిధులు హాజరై తమ సంపూర్ణ మద్దతును తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ప్రతినిధులు మాట్లాడుతూ సికింద్రాబాద్ ప్రాంత వాసులుగా ఇక్కడే పుట్టి పెరిగామని, మా అస్తిత్వాన్ని దెబ్బ తీస్తామంటే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించే అన్ని పోరాటాలలో తాము భాగస్వాములం అవుతామని ప్రకటించారు. అన్ని వర్గాల ప్రజలు, సంఘాలు, పార్టీ లను కలుపుకొని సికింద్రాబాద్ మున్సిపల్ కార్పోరేషన్ ఏర్పాటు చేసే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. మద్దతు తెలిపిన సంఘాల ప్రతినిధులకు ఆయన అభినందనలు తెలిపారు. పాట్ మార్కెట్ మార్వాడీ అసోసియేషన్, మోండా మార్కెట్ రిటైల్ వెజిటబుల్ అసోసియేషన్, సికింద్రాబాద్ క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్, ప్రైవేట్ అంబులెన్స్ సర్వీస్ అసోసియేషన్, బెంగాలీ సమాజ్, పేపర్ మర్చంట్స్ అసోసియేషన్, నాయీ బ్రాహ్మణ సేవా సంఘం, ప్రభుత్వ గుర్తింపు పొందిన స్కూల్స్ అసోసియేషన్, స్వప్న లోక్ అసోసియేషన్, రాణి గంజ్ విని గూడ్స్ వెహికల్స్ అసోసియేషన్, విశ్వకర్మ సంఘం, మేరు సంఘం, బోయిన్ పల్లి కూరగాయల మార్కెట్ హమాలీ సంఘం, తెలంగాణ యాదవ సంక్షేమ సంఘం, హాకర్స్ యూనియన్, జనరల్ మర్చంట్స్ అసోసియేషన్, బోయిన్ పల్లి విజిటబుల్ మార్కెట్ విని గూడ్స్, డ్రైవర్స్ అసోసియేషన్, సుభాష్ రోడ్ రిటైల్ క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్, జనరల్ బజార్ అండ్ పాట్ మార్కెట్ గోల్డ్ అండ్ సిల్వర్ టెస్టింగ్ అసోసియేషన్, పాట్ మార్కెట్ జువెల్లర్స్ అసోసియేషన్, ఐ డి హెచ్ కాలనీ షాపింగ్ కాంప్లెక్స్ అసోసియేషన్ తదితర సంఘాలు సికింద్రాబాద్ మున్సిపల్ కార్పోరేషన్ సాధన ఉద్యమం లో పాల్గొంటామని ప్రకటించారు.



రెండు తెలుగు రాష్ట్రాల మధ్య వివాదాలు ఉండకూడదనే కాంగ్రెస్ తెలంగాణ ఇచ్చిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. రాజకీయాలకు అతీతంగా నీళ్ల సమస్యను పరిష్కరించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. కోర్టుల్లో కాకుండా మన సమస్యలను మనమే పరిష్కరించుకుందామని సీఎం విజ్ఞప్తి చేశారు. ల వివాదం విషయంలో రాజకీయ ప్రయోజనం పొందాలని తమ ప్రభుత్వం ప్రయత్నించడం లేదని ఆయన స్పష్టం చేశారు.
- సీఎం రేవంత్ రెడ్డి

సిద్ధిపేట జిల్లాను రద్దు చేస్తే ఊరుకోం..

- మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు హెచ్చరిక..
- బీఆర్ఎస్‌లో చేరిన బీజేపీ మాజీ పట్టణ అధ్యక్షుడు పత్రి శ్రీనివాస్




ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట జనవరి 09:

సిద్దిపేట జిల్లాను రద్దు చేస్తే ఊరుకునేది లేదని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు స్పష్టం చేశారు. జిల్లాలు ఎక్కువయ్యాయని సాకుతో సిద్దిపేట జిల్లాను రద్దు చేసి మళ్లీ సంగారెడ్డిలో కలపాలన్న కుట్ర జరుగుతోందని ఆయన ఆరోపించారు. అవసరమైతే మరో ఉద్యమానికి సిద్ధమని హెచ్చరించారు. సిద్దిపేటలో జరిగిన కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు పత్రి శ్రీనివాస్ యాదవ్, సీనియర్ నాయకుడు హనుమంత్ రావు తమ అనుచరులతో కలిసి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా హరీష్ రావు వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ...

ఒకప్పుడు సిద్దిపేటలో మంచినీళ్లకు తీవ్ర ఇబ్బందులు ఉండేవని, నేడు ఇంటింటికీ నల్లా నీళ్లు వస్తున్నాయని గుర్తు చేశారు. మురికి కాలువల స్థానంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేశామని తెలిపారు. కమ్యూనిటీ హాళ్లు, వీధి దీపాలు, చెత్త సేకరణ వంటి అంశాల్లో సిద్దిపేట రాష్ట్రానికే మోడల్‌గా నిలిచిందన్నారు.
సిద్దిపేట విద్యా, వైద్య రంగాల్లోనూ ముందంజలో ఉందని, మెడికల్ కాలేజ్‌తో పాటు పలు విద్యాసంస్థలు అందుబాటులోకి వచ్చాయని చెప్పారు. కోమటి చెరువు పర్యాటక కేంద్రంగా మారి జిల్లాకు గుర్తింపు తెచ్చిందన్నారు.40 ఏళ్ల సిద్దిపేట ప్రజల కలను కేసీఆర్ నిజం చేసి జిల్లాను ఏర్పాటు చేశారని గుర్తు చేసిన హరీష్ రావు, జిల్లా రద్దయితే కలెక్టరేట్, మెడికల్ కాలేజ్, జిల్లా ఆసుపత్రి, పలు ప్రభుత్వ కార్యాలయాలు కోల్పోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. నాపై కోపం ఉంటే నాపైనే చూపించాలి కానీ సిద్దిపేట ప్రజలపై కాదని రేవంత్ రెడ్డిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు.అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని విమర్శించారు. రూ. 4000 పెన్షన్, మహిళలకు నెలకు రూ. 2500, కల్యాణ లక్ష్మి, రైతుబంధు వంటి పథకాలు అమలు కావడం లేదన్నారు. కేసీఆర్ పాలనలో ఉన్న సంక్షేమ పథకాలు ఇప్పుడు కనిపించడం లేదని ఆరోపించారు.రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ నాయకులే గెలవాలని పిలుపునిచ్చిన హరీష్ రావు, సిద్దిపేట అభివృద్ధి కోసం పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. బీజేపీ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన నేతలకు పార్టీలో తగిన ప్రాధాన్యం కల్పిస్తామని తెలిపారు.



కళాకారుల పోరు దీక్షను విజయవంతం చేయండి

- వాల్ పోస్టర్ విడుదల చేసిన కళాకారులు

ప్రతిపక్షం ప్రతినిధి మెదక్ జనవరి 09 :-

తెలంగాణ నిరుద్యోగ ఉద్యమ కళాకారుల సమస్యల పరిష్కారం కోసం, ఈ నెల 20వ తేదీన హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద చేపట్టబోయే "నిరుద్యోగ ఉద్యమ కళాకారుల పోరుదీక్ష" కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను శుక్రవారం వారం స్థానిక టీఎన్జీవో భవన్లో విడుదల చేశారు. ఈ కార్యక్రమం మెదక్ జిల్లా నిరుద్యోగ ఉద్యమ కళాకారుల సంఘం అధ్యక్షులు గుడాల సత్యనారాయణ మాట్లాడుతూ.. తెలంగాణ మలిదశ ఉద్యమంలో తమ ఆట పాటలతో చైతన్యం నింపిన కళాకారుల పరిస్థితి నేడు దయనీయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. నిరుద్యోగ కళాకారులను ప్రభుత్వం గుర్తించి, తక్షణమే న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 25 తేదీన హైదరాబాద్లోని ఇంద్ర పార్క్ వద్ద పోరుదీక్షను విజయవంతం చేయాలని ఈ పోరుదీక్ష ద్వారా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడమే లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. అనంతరం వాల్ పోస్టర్ విడుదల చేశారు ఈ కార్యక్రమంలోకంచన్ పల్లి బిక్షపతి చీకోడ్ సాయిలు.శేఖర్ చారి.అల్లారం ప్రేమ్ కుమార్ కొమ్ముల శ్రీశైలం గౌడ్.వడ్ల నవీన్గుడాల చందు. తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధుల దుర్వినియోగంపై
కఠిన చర్యలు తప్పవు..

- ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట జనవరి 09:

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు పక్కదారి పట్టినట్లయితే ఎంతటి వారైనా సరే కఠిన చర్యలు తప్పవని రాష్ట్ర షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య స్పష్టం చేశారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా ఇంటిగ్రేటెడ్ డిస్ట్రిక్ట్ కలెక్టర్ కార్యాలయ సముదాయం (IDOC) సమావేశ మందిరంలో, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ల్యాండ్,అట్రాసిటీ కేసులపై నిర్వహించిన సమీక్ష సమావేశానికి ఆయన విశిష్ట అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అణచివేతకు గురైన ఎస్సీ, ఎస్టీ వర్గాల అభివృద్ధి కోసం జిల్లాలోని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని తెలిపారు. రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా పారదర్శకంగా పనిచేసి పేద ప్రజలకు న్యాయం చేయాలని అధికారులకు సూచించారు. బాధితుల సమస్యలను శ్రద్ధగా వినడమే సమస్య పరిష్కారానికి సగం మార్గమని పేర్కొన్నారు. ప్రభుత్వం మంజూరు చేసే ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు లబ్ధిదారులకు పూర్తిగా చేరేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, ఎక్కడైనా నిధుల దుర్వినియోగం జరిగితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.జిల్లాలో 2022 నుంచి 2025 వరకు 355 అట్రాసిటీ కేసులు నమోదవగా, వాటిలో 328 కేసుల్లో బాధితులకు పరిహారం అందించామని, వివిధ కారణాల వల్ల 27 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు.గురుకుల పాఠశాలల మరమ్మతులపై నివేదికను కమిషన్‌కు సమర్పించాలని, బెస్ట్ అవైలబుల్ స్కూళ్ల విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి చొరవతో 25 శాతం బడ్జెట్ విడుదలైందని, మిగతా బడ్జెట్‌ను మార్చి చివర్లోగా విడుదల చేస్తామని తెలిపారు.రాష్ట్రంలో రంగారెడ్డి జిల్లా తర్వాత అత్యధికంగా గురుకులాలు ఉన్న జిల్లా సిద్దిపేట అని పేర్కొంటూ, ఈ స్కూళ్లలో అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి పెండింగ్ వేతనాల చెల్లింపుపై రాష్ట్ర ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు. జనవరి చివరి వరకు ఆరు నెలల పెండింగ్ వేతనాలు త్వరలోనే చెల్లిస్తామని స్పష్టం చేశారు.గ్రామాలలో గోడౌన్లు, మహిళా సంఘాల భవనాలు, పంచాయితీ భవనాల నిర్మాణానికి సంబంధించిన నివేదికలు సిద్ధం చేయాలని, అక్బర్‌పేట-భూంపల్లి ప్రాంతంలో విద్యుత్ లైన్ల మరమ్మతులకు ప్రతిపాదనలు పంపించాలని సూచించారు. భూంపల్లి పరిధిలో కూలిపోయే ప్రమాదంలో ఉన్న రెండు వాటర్ ట్యాంకుల స్థానంలో కొత్త ట్యాంకుల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.జనవరి నెలాఖరులోగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పరిష్కరించాలని, ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో ఎల్-1, ఎల్-2, ఎల్-3 విభాగాలుగా లబ్ధిదారులను విభజించి పూర్తిగా పారదర్శకంగా ఇళ్లు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు.ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ కె. హైమావతి, సీపీ సాధన రష్మీ పెరుమాళ్, అడిషనల్ కలెక్టర్ అబ్దుల్ హమీద్, ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు, పోలీస్ అధికారులు, ఆర్డీఓలు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీ గణతంత్ర వేడుకల్లో డప్పు దరువు వినిపించబోతున్న దొమ్మాట యువకుడు..

- దొమ్మాట గ్రామానికి చెందిన దేవి గారి బాలయ్య ఎల్లవ్వ దంపతుల కుమారుడు ఆనంద్
- దౌల్తాబాద్ ఢిల్లీ గణతంత్ర వేడుకల్లో డప్పు దరువును వినిపించబోతున్న దొమ్మట గ్రామానికి చెందిన కళాకారుడు ఆనంద్



ప్రతి పక్షం,దౌల్తాబాద్, జనవరి 9:

ఢిల్లీలో గణతంత్ర దినోత్సవ వేడుకల్లో సిద్దిపేట జిల్లా నుంచి ఓ యువకుడు డప్పు దరువు వినిపించబోతున్నాడు. దౌల్తాబాద్ మండల పరిధిలోని దొమ్మట గ్రామానికి చెందిన దేవి గారి బాలయ్య దేవి గారి ఎల్లవ్వ దంపతుల పెద్ద కొడుకు దేవి గారి ఆనంద్ బి.ఎ డిగ్రీ వరకు చదువుకున్నాడు. అయితే ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్ యువ పురస్కారం గ్రహీత అందె భాస్కర్ గారి నేతృత్వంలో దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన డప్పు కళాకారుల్లో తెలంగాణ రాష్ట్రం సిద్దిపేట జిల్లా నుంచి ఆనంద్ ఒక్కరే డప్పు ప్రదర్శన ఇచ్చేందుకు ఎంపికయ్యారు. ఈనెల 26న ఢిల్లీలో గణతంత్ర దినోత్సవ వేడుకల్లో రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ప్రధానమంత్రి, ఇతర ప్రముఖులు పాల్గొనే వేదిక కార్యక్రమంలో డప్పు దరువును వినిపించేందుకు ఆనంద్ కు అరుదైన అవకాశం దక్కింది. అంతరించిపోతున్న డప్పు దరువుకు, ప్రాణం పోసిన డప్పు కళాకారుడు ఆనంద్ కు అవకాశం రావడం పట్ల తల్లిదండ్రులు, మిత్రులు, బంధువులు,గ్రామస్తులు వర్షం వ్యక్తం చేస్తున్నారు.

పదో తరగతి విద్యార్థులకు చేతిరాతపై అవగాహన సదస్సు ..

- పరీక్షల్లో అధిక మార్కుల కోసం మెలకువలు
- ప్రముఖ చేతివ్రత నిపుణులు ఎజాస్ అహ్మద్

ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట, జనవరి 9:

జీవితం ఒక నవరసాల నిలయమని అది ఆ చదువుల తల్లికి ఆలయమని దానికి అనుక్షణం శ్రమించాలని ప్రముఖ చేతివ్రత నిపుణులు ఎజాస్ అహ్మద్ అన్నారు. సిద్దిపేట జిల్లా అర్బన్ మండలం తడకపల్లి శ్రీ విద్యారణ్య స్వామి ఆవాస విద్యాలయంలో పదవ తరగతి విద్యార్థులకు చేతిరాతపై నిర్వహించిన అవగాహన సదస్సు లో పాల్గొని తెలుగు హిందీ ఇంగ్లీష్ సబ్జెక్టులకు గానుపరీక్షల్లో అధిక మార్కులు పొందేందుకు మెలకువలను నేర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవ తరగతి మీ బతుకు బాటలో ఒక మొదటి మలుపు అని దీన్ని విజయవంతంగా దాటితేనే రేపటి బతుకులో గెలుపు ఉంటుందన్నారు. మేడలున్న, మిద్దెలున్న, అధికారాన్ని చూపించే గద్దెలున్న ఆ చదువు అని సంపద లేనిదే ఎన్ని ఉన్నా అది గుండు సున్నానే అని అన్నారు. విద్యార్థులు సంక్రాంతి సెలవుల్లో అభ్యసన బాగా చేసి పరీక్షలు బాగా రాయాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మద్దుల నవీన్,ఆచార్యులు పాల్గొన్నారు.

చేగుంట మార్కెట్ కమిటీ యార్డుల నిర్మాణం కోసం 30 లక్షలు మంజూరు

- ఏఎంసీ చైర్మన్ ప్రమాణస్వీకారంలో చెరుకు శ్రీనివాసరెడ్డి వెల్లడి



ప్రతిపక్షం, చేగుంట, జనవరి 9:

చేగుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డుల నిర్మాణం కోసం 30 లక్షలు మంజూరైనట్లు దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి చెరుకు శ్రీనివాసరెడ్డి అన్నారు. చేగుంట ఏఎంసీ చైర్మన్ తాడేపు వెంగళరావు ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తన తండ్రి మాజీ మంత్రివర్యులు చెరుకు ముత్యంరెడ్డి నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో వ్యవసాయ మార్కెట్ కమిటీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆయన నియోజవర్గంలో చేసిన అభివృద్ధి అమోఘమనీ కొనియాడారు. చేగుంట ఉమ్మడి మండలంలో అభివృద్ధి సాధించిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరి కోసం తన వంతు సహాయశక్తుల కృషి చేస్తానని తెలిపారు. చేగుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గా ఎంపికైన వెంగళరావు తోపాటు కార్యవర్గం రైతుల సంక్షేమం కోసం పాటుపడాలని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు చంద్రపాల్ చేగుంట కోఆపరేటివ్ బ్యాంక్ ఎక్స్ చైర్మన్ నరసింహచారి వివిధ మండలాల మార్కెట్ కమిటీ చైర్మన్లు డైరెక్టర్లతోపాటు సెక్రటరీలు ఉష ఈశ్వర్ చేగుంట మేజర్ గ్రామం పంచాయతీ సర్పంచ్ స్రవంతి సతీష్ ఉప సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు మహమ్మద్ రఫీక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వడ్ల నవీన్ వివిధ గ్రామాల సర్పంచులు ఉపసర్పంచ్లు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొని వెంగళరావు సన్మానించారు . అంతకుముందు చేగుంట బైపాస్ రోడ్డు బ్రిడ్జి నుండి బస్టాండ్ మీదుగా మార్కెట్ కమిటీ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు.



వివేకానందలో సంక్రాంతి వేడుకలు..

ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట జనవరి 09:

సిద్దిపేట పట్టణం భారత్ నగర్ లోని వివేకానంద ఇంగ్లీష్ మీడియం పాఠశాల లో సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులందరూ రంగోలి కార్యక్రమములో పాల్గొన్నారు.గాలి పటాలను కూడా ఎగురవేయాడము జరిగింది.రంగోలి కార్యక్రమములోని విజేతలకు పాఠశాల ప్రిన్సిపాల్ యాల్లా భాస్కర్ రెడ్డి ప్రథమ ద్వితీయ మరియు తృతీయ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమములో కరస్పాండెంట్ లిఖిత, ఉపాధ్యాయినిలు వాణిశ్రీ, రత్నమాల,కావేరి, దేవిక,భరతమాత, ఫిర్దజ్,సారిక,మానుష తదితరులు పాల్గొన్నారు.



ఆడపడుచులకు అండగా ఉంటాం

ప్రతిపక్షం మంచిర్యాల జనవరి 9

మహిళలకు ఎల్లవేళలా అండగా ఉంటామని మాజీ డిసిసి అధ్యక్షురాలు మంచిర్యాల కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు సతీమణి కొక్కిరాల సురేఖ స్పష్టం చేశారు మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలో గల నస్పూర్ ఏరియాలోని మూడు నుండి 17 వ వార్డులకు శ్రీరాంపూర్ లో గల ప్రగతి స్టేడియంలో శుక్రవారం మహిళలకు ఉచిత బతుకమ్మ చీరల పంపిణీలో ఆమె మాట్లాడారు సందర్భంగా మాట్లాడుతూ ఆడపడుచులకు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు ఎమ్మెల్యే నిరంతరం అండగా ఉండి పని చేస్తారని అన్నారు శుక్రవారం కక్కిరాల రఘుపతిరావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చీరల పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు కళ్యాణ్ లక్ష్మి షాదీ ముబారక్ కార్యక్రమాలకు కార్యక్రమాలకు ఇప్పటికే చాలామందికి చెక్కుల పంపిణీ చేయడం జరిగింది అన్నారు దసరా సమయంలో ప్రేమ్ సాగర్ రావు ఆరోగ్యం బాగాలేనందున దసరాకు పంపిణీ చేయవలసిన చీరలను సంక్రాంతికి పంపిణీ చేయడం జరుగుతుందన్నారు ప్రస్తుతం ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు ఆరోగ్యం కుదుటపడిందని తెలిపారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు



అనాజిపూర్ లో దళితుల పై దాడి చెసిన నిందితులను అరెస్టు చేయరా

-ఎస్సీ ఎస్టీ కమిషన్ సమీక్ష లో పోలీసులను నిలదీసిన డిబిఎఫ్ నేత పి.శంకర్


ప్రతి పక్షం,రాయపోల్ జనవరి9:

రాయపోల్ మండలం అనాజిపూర్ లో దళితుల పై దాడి చెసిన నిందితులను అరెస్టు చేయడంలో నిర్లక్ష్యం ఎందుకు చెస్తున్నారని డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ పోలీసుల ను నిలదీశారు.శుక్రవారంనాడు సిద్దిపేట జిల్లా కలెక్టర్ కార్యాలయం జరిగిన ఎస్సీ ఎస్టీ కమిషన్ సమీక్ష సమావేశంలో కమిషనర్ ను గజ్వేల్ ఎసిపిని నిలదీశారు. ఇందుకు స్పందించి న కమిషనర్ నిందితులను అరెస్ట్ చెస్తామని మొత్తం ఫైల్ తీసుకొని రావాలని ఎసిపిని కమిషనర్ ను ఆదేశించారు. నిందితులను తక్షణమే అరెస్టు చేయాలని రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఎసిపి ని ఆదేశించారు. రాయపోల్ మండలం వడ్డేపల్లి, ములుగు మండలం క్షిరసాగర్,వర్గల్ మండలం అంబర్ పే ట దళితులకు నష్టపరిహారం అందించాలని కోరారు. రాయపోల్ మండలం చిన్నమాసాన్ పల్లి గ్రామానికి చెందిన దళితురాలు బాగ్యకు ఇందిరమ్మ ఇల్లు నిర్మాణానికి మొదటి బిల్లు ఇచ్చి రెండవ బిల్లు అపేశారని చైర్మన్ కు విన్నవించగా బిల్లు చెల్లించాలని చైర్మన్ యపిడిఓ శ్రీనివాస్ ఆదేశించారు. దౌల్తాబాద్ మండలం తిర్మలాపూర్ దళితుల భూమి ని అక్రమించిన మాజి సర్పంచ్ పై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో డిబిఎఫ్ నేతలు ఎగొండ ,వేణు, భీమ్ శేఖర్,పొతరాజు శంకర్,బెజ్జంకి తిరుపతి, బాధితులు యాదగిరి,దివా కర్, యాదగిరి, మహెష్ తదితరులు పాల్గొన్నారు.

నారాయణపేట జిల్లా మాదిగ జాగృతి సంఘం నూతన కమిటీ

- అధ్యక్షులుగా మల్లికార్జున మహారాజ్ ను ఆరుగురు సభ్యులు

ప్రతిపక్షం ప్రతినిధి, నారాయణపేట్ జిల్లా జనవరి 09



మాదిగ జాగృతి సంఘం రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు మాదిగ జాగృతి సంఘం రాష్ట్ర నాయకులు శివరాజ్ మహారాజ్, ఆధ్వర్యంలో నారాయణ పేట జిల్లా మాదిగ జాగృతి సంఘం నూతన కమిటీని ఏర్పాటు చెయ్యడం జరిగింది. రాష్ట్ర నాయకులు హరప్ప మహారాజ్ ను జిల్లా జిల్లా ఇన్చార్జిగా నియమించడం జరిగింది. అధ్యక్షులుగా మల్లికార్జున మహారాజ్ ను ఆరుగురు సభ్యులను ఉపాధ్యక్షులుగా శివరాజ్ మహారాజ్ ను, డేవిడ్ మహారాజ్, ఈశ్వర్ మహారాజ్,నగేష్ మహారాజ్, దానపోల రమేష్ మహారాజ్,సందుల రాజు మహారాజ్ లను నియమించడం జరిగింది ప్రధాన కార్యదర్శిగా కృష్ణా మహారాజ్ ను కోశాధికారిగా గోపాల కృష్ణ మహారాజ్ ను సోషల్ మీడియా ఇంచార్జి తిరుమలేష్ మహారాజ్ ను కార్యదర్శులుగా వేణు మహారాజ్, అంజి మహారాజ్, నర్సింహా మహారాజ్ లను నియమించడం జరిగింది. మాదిగ జాగృతి సంఘం లక్ష్యం నారాయణపేట జిల్లాలోని మాదిగలను చైతన్యపరిచడం మాదిగలకు మహారాజులుగా నామకరణం చెయ్యడం ఈ సందర్భంగా మాదిగ జాగృతి సంఘం రాష్ట్ర నాయకులు శివరాజ్ మాట్లాడుతూ నారాయణ పేట జిల్లా మాదిగ జాగృతి సంఘం నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది మాదిగల ఆత్మగౌరవాన్ని పెంపొందించే విధంగా మాదిగలను చైతన్యం చెయ్యాలని తెలియజేయడం జరిగింది. నూతనంగా ఎన్నికైన జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ నాకు ఇచ్చిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తానని మాదిగ జాగృతి సంఘాన్ని జిల్లాలో బలోపేతం చేస్తానని మాట్లాడటం జరిగింది ఈ కార్యక్రమంలో నూతన కమిటీ సభ్యులు మల్లికార్జున్, శివరాజ్, డేవిడ్, కృష్ణా, నరేష్, రమేష్, నగేష్, వేణు, అంజి,నరసింహా తదితరులు పాల్గొన్నారు.



మెట్రో ఉద్యోగుల సర్వీస్‌ను పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ పరిధిలో పనిచేస్తున్న అన్ని విభాగాలకు చెందిన 244 మంది సర్వీస్‌ను 2026 మార్చి 31 వరకు పొడిగిస్తూ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా ఉత్తర్వులు వెలువరించారు..

- హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్



క్రీడా రంగంలో నిజామాబాద్ ఖ్యాతిని ఇనుమడింపజేయాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి పిలుపు
- అర్బన్ ఎమ్మెల్యేతో కలిసి సీఎం కప్ టార్చ్ రిలే ర్యాలీని ప్రారంభించిన కలెక్టర్

ప్రతిపక్షం బ్యూరో,

నిజామాబాద్ జనవరి 09 : క్రీడా రంగంలో నిజామాబాద్ జిల్లా ఖ్యాతిని మరింతగా ఇనుమడింపజేయాలని జిల్లా పాలనాధికారి ఇలా త్రిపాఠి పిలుపునిచ్చారు. గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సీ.ఎం కప్2026 సెకండ్ ఎడిషన్ క్రీడా పోటీలను పురస్కరించుకుని శుక్రవారం నిజామాబాద్ నగరంలోని పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణతో కలిసి జెండా ఊపి టార్చ్ రిలే ర్యాలీని కలెక్టర్ ప్రారంభించారు. పాలిటెక్నిక్ మైదానం నుండి ప్రారంభమైన టార్చ్ రిలే ర్యాలీ, ప్రధాన మార్గాల మీదుగా పాత కలెక్టరేట్ గ్రౌండ్ వరకు కొనసాగింద ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నిజామాబాద్ జిల్లా నుండి నిఖత్ జరీన్, యెండల సౌందర్య, గూగులోత్ సౌమ్య, హుస్సాముద్దీన్ వంటి అనేక మంది అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులు ప్రాతినిధ్యం వహిస్తుండడం ఎంతో గొప్ప విషయం అన్నారు. వీరిని స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థిని, విద్యార్థులు, గ్రామీణ ప్రాంత క్రీడాకారులు తమ ప్రతిభను మెరుగుపర్చుకోవాలని కలెక్టర్ సూచించారు. క్రీడల్లో ధనిక, పేద అనే తారతమ్యం ఉండదని, ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు ప్రతిభనే కొలమానం అని క్రీడాకారులకు మార్గనిర్దేశం చేశారు. అతి సామాన్య కుటుంబం నుండి వచ్చిన క్రికెటర్ మహ్మద్ సిరాజ్ జీవితమే ఇందుకు చక్కటి నిదర్శనమని కలెక్టర్ ఉదహరించారు. క్రీడల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిస్తే బంగారు భవిష్యత్తు సొంతం అవుతుందన్నారు. సీ.ఎం కప్ క్రీడా పోటీలలో అన్ని అంశాలలో జిల్లాకు చెందిన క్రీడాకారులు అద్భుత ప్రదర్శన ఇచ్చి, నిజామాబాద్ ప్రతిష్టను ఇనుమడింపజేయాలని పిలుపునిచ్చారు. తాను కూడా స్విమ్మింగ్ క్రీడాకారిణి అని, ఫ్రీ స్టైల్, రిలే, బట్టర్ ఫ్లై తదితర విభాగాలలో అనేక పోటీలలో పాల్గొన్నానని కలెక్టర్ క్రీడల పట్ల తనకు గల ఆసక్తి గురించి తెలియజేశారు. చక్కటి దేహదారుఢ్యానికి, ఆరోగ్యానికి క్రీడలు ఎంతగానో ఉపకరిస్తాయని గుర్తు చేశారు. ఆరోగ్యంగా ఉన్నప్పుడే మెదడు చురుకుగా మారి చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపగలుగుతారని, అన్ని రంగాలలో చక్కగా పని చేయవచ్చని సూచించారు. క్రీడల అభివృద్ధికి జిల్లా యంత్రాంగం తరపున పూర్తి స్థాయిలో తోడ్పాటును అందిస్తామని అన్నారు.అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతో పాటు క్రీడలలో ఆసక్తిని పెంపొందించుకోవాలని సూచించారు. విద్యార్థి దశ ఎంతో కీలకమైనదని, దురలవాట్ల బారిన పడకుండా ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని, ఇందుకు క్రీడలను వేదికగా మల్చుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడల అభివృద్ధి అధికారి పవన్ కుమార్, జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొబ్బిలి నర్సయ్య, క్రీడా సంఘాల ప్రతినిధులు, కోచ్ లు, క్రీడాకారులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.



నాళేశ్వర్ మున్నూరు కాపు సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, జనవరి 09 :

జిల్లా లోని నవీపేట్ మండలం నాళేశ్వర్ గ్రామంలో మున్నూరు కాపు సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో నూతన కమిటీని ప్రకటించారు. సంఘ అధ్యక్షుడిగా మగ్గరి హన్మండ్లు, ఉపాధ్యక్షుడిగా ద్యాగ రాజు, ప్రధాన కార్యదర్శిగా కోనేరు సుదర్శన్, కోశాధికారిగా తోట గణేష్‌ను ఎన్నుకున్నారు. కార్యదర్శులుగా పిప్పేర శ్రీకాంత్, ఎద్దండి పోశెట్టి, సహాయ కార్యదర్శులుగా పుప్పాల నడ్పి బోజన్న, పుప్పాల శ్రీకాంత్‌ను ఎంపిక చేశారు. సభ్యులుగా ఆర్మూర్ బోజారం, ద్యాగ గంగాదర్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మగ్గరి హన్మండ్లు మాట్లాడుతూ మున్నూరు కాపు సంఘ అభివృద్ధి దిశగా పనిచేస్తామని తెలిపారు. నాళేశ్వర్ గ్రామ అభివృద్ధికి సంఘం ఎల్లప్పుడూ సహకరిస్తుందని, గ్రామంలోని అన్ని కుల సంఘాలను కలుపుకొని సమిష్టి అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

ఏ టీ ఏం లో డబ్బులు దొంగిలించే అంతర్ రాష్ట్రా దోపిడీ మూటను పట్టుకున్న పోలీసులు

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, జనవరి 09 :



జిల్లా కేంద్రంలో ఏ టీ ఏం లో డబ్బులు దొంగలించే ముఠాను పట్టుకున్నట్లు నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య తెలిపారు. శుక్రవారం పోలీస్ కమాండ్ కంట్రోల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీపీ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని ఒకటవ పోలీస్ స్టేషన్ పరిధి ఖలీల్ వాడి పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఏ టీ ఏం లో గత నెలా 31 న రాత్రి 02.19 గంటలకు గుర్తు తెలియని 5 గురు దొంగలు ఎటిఎం ను ధ్వంసము చేసి గ్యాస్ కట్టర్ తో కాల్చి డబ్బులు దొంగిలించే ప్రయత్నమూ చేసినారని బ్లూ కోల్ట్ విధులు నిర్వహించే న్యాలకంటి లక్ష్మన్ పిర్యాదు చేశారు. నిజామాబాద్ సీపీ ఉత్తర్వులు మేరకు ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి కేసుని చేదించడమైనది. సిసి ఫుటేజ్ ఆధారంగా నేరస్థులను గుర్తించి నేరస్తుల గురించి గాలించగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని నిఖిల్ సాయి హోటల్ వద్ద పోలీసులు వాహనాలను తనిఖీలు చేస్తుండగా వన్ టౌన్ ఎస్ హెచ్ ఓ బి రఘుపతి పట్టుకున్నట్లు తెలిపారు.నిందితులు హర్యానా కు చెందిన అబ్దుల్లా ఖాన్, వాజీబ్ ఖాన్, మొహమ్మద్ అజీబ్, శామోద్దిన్, బేగం పెట్ హైదరాబాద్ కు చెందిన మొహమ్మద్ అమీర్ అన్సారి లు ఉన్నట్లు తెలిపారు. నేరస్తులు బొలెరో వాహనములో కర్రలు, రాళ్లు పెట్టుకొని వస్తుంటే ఆపి చెక్ చేసి విచారించగా ఏటిఎం లో చోరీలకు పాల్పడినట్లు తేలింది. నిందితుల నుంచి ఒక చిన్న ఆక్సిజన్ సిలిండర్, ఒక చిన్న ఎల్ పీ జీ సిలిండర్ ఎరుపు, బ్లూ కలర్ పైపులతో గ్యాస్ కట్టర్, రెండు జతల సర్జికల్ గ్లౌస్ లు, కంపనీ కి చెందిన స్ప్రే బాటల్, ఒక చిన్న ఇనుప రాడ్, ఒక మాస్టర్ కీ బ్లూ కలర్ ప్లాస్టిక్ పిడి, ఒక కటింగ్ ప్లేర్ లను పోలీసులు స్వదినపర్చుకున్నారు.

ఈ నెలా 11న మున్నూరు కాపు సర్పంచ్ ఉప సర్పంచ్ లకు సన్మానం

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, జనవరి 09 :

జిల్లాలో ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికలలో గెలుపొందిన మున్నూరు కాపు సామాజిక వర్గానికి చెందిన సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులను ఈనెల 11న సన్మానించనున్నట్లు మున్నూరు కాపు సంగం జిల్లా అధ్యక్షుడు ధర్మపురి సంజయ్ వెల్లడించారు. శుక్రవారం నిజామాబాద్ లోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జిల్లాలో 67 మంది సర్పంచ్ లు, 60 మంది ఉప సర్పంచులు, 474 మంది వార్డు మెంబర్లు గెలుపొందారని తెలిపారు. ఈ సందర్భంగా వీరందరితో కలిసి 11న జిల్లా కేంద్రంలోని శంకర్ భవన్ పాఠశాల నుండి గాంధీ చౌక్, బస్టాండ్, రైల్వే స్టేషన్, మున్సిపల్ చౌరస్తా మీదుగా ప్రగతి నగర్ మున్నూరు కాపు సంఘం వరకు ర్యాలీ జరుగుతుందని తెలిపారు. ఈ జిల్లాకు చెందిన మున్నూరు కాపు సామాజిక వర్గానికి చెందిన అర్గుల్ రాజారాం, కె.వి గంగాధర్, కిసాన్ గంగాదాస్, డి శ్రీనివాసులు ఎంతో ప్రజాసేవ, ఎన్నో అభివృద్ధి పనులు చేశారని తెలిపారు. నిజామాబాద్ నగరంలో ఇంటింటికి గోదావరి నీళ్లు వస్తున్నాయంటే డి శ్రీనివాస్ కారణమన్నారు. ఇటువంటి ఈ జిల్లాకు గత ఎన్నికల్లో ఎంపీ, ఎమ్మెల్యే ఎన్నికల లో ఒక సీటు ఇవ్వకపోవడం దురదృష్టకరమన్నారు. తమ సంఘాన్ని గుర్తించి రాబోవు ఎన్నికల్లో టికెట్ ఇవ్వాలని కోరుతున్నట్లు తెలిపారు. రాహుల్ గాంధీ బీసీ నినాదం తీసుకొని బలోపేతం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అదే బాటలో నడుస్తున్నారని, బీసీ వర్గం చెందిన మహేష్ కుమార్ కు పిసిసి అధ్యక్షులు చేశారని గుర్తు చేశారు. జిల్లా ను అభివృద్ధి చేసేందుకు మహేష్ కుమార్ గౌడ్, పి సుదర్శన్ రెడ్డి లు ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. గత ఎన్నికల్లో మున్నూరు కాపులకు ఏ విధంగా ఐతే అన్యాయం జరిగిందో రానున్న ఎన్నికల్లో న్యాయం చేస్తారని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో నాయకులు చిన్న రాజేశ్వర్, వెంకటేశ్వరరావు, ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు.

తెలంగాణ ఉన్నత విద్యామండలి నుంచి వినూత్న 'క్యాలెండర్‌కమ్‌ప్లానర్2026' విడుదల

కూకట్ పల్లి, ప్రతిపక్షం, జనవరి 09:



ఈ రోజు తెలంగాణ ఉన్నత విద్యామండలిలో తెలంగాణ ఉన్నత విద్యామండలి, 2026 డైరీ, 'క్యాలెండర్‌కమ్‌ప్లానర్'ను ఛైర్మన్ ప్రొ. వి. బాలకిష్టా రెడ్డి విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ 1 ప్రొ. ఈ. పురుషోత్తం, వైస్‌ఛైర్మన్2 ప్రొ. ఎస్.కె. మహమూద్, కార్యదర్శి ప్రొ. శ్రీరామ్ వెంకటేష్‌తో పాటు మండలి సిబ్బంది పాల్గొన్నారు.

గత ఏడాది 'భారత రత్నాలు', ఈసారి 'విశ్వ విద్యావేత్తలు'

గత సంవత్సరం (2025) క్యాలెండర్‌లో దేశానికి చెందిన మహనీయులైన సావిత్రీబాయి ఫూలే, డా. జాకిర్ హుస్సేన్, చాణక్యుడు, గౌతమ బుద్ధుడు, గురుదేవ్ రవీంద్రనాథ్ ఠాగూర్, స్వామి వివేకానంద, సర్వేపల్లి రాధాకృష్ణన్, మదర్ థెరిస్సా, గిజుభాయ్ బధేకా, ఏపీజే అబ్దుల్ కలాం, పండిట్ మదన్ మోహన్ మాలవ్య, కైలాష్ సత్యార్థి వంటి ప్రముఖులను గౌరవించినట్లు ప్రొ. వి. బాలకిష్టా రెడ్డి గుర్తు చేశారు. విద్య వ్యాప్తి, శాస్త్రీయ దృక్పథం, మానవ హక్కులు, హేతువాదాన్ని పెంపొందించడంలో వారి కృషిని దృష్టిలో ఉంచుకుని ఆ నిర్ణయం తీసుకున్నామని వివరించారు.

ఉన్నత విద్యపై విస్తృత చర్చకు శ్రీకారం

అయితే, ప్రస్తుత 2026 క్యాలెండర్ ఒక విభిన్నమైన లక్ష్యంతో రూపొందించబడింది. ప్రపంచవ్యాప్తంగా జ్ఞానం, సమాచారం యొక్క వ్యాప్తి, ప్రజాస్వామ్యీకరణలో అత్యంత ముఖ్యమైన పాత్ర పోషించిన మేధావులు, పండితులు, క్రియాశీలుల ద్వారా *ఉన్నత విద్య*పై చర్చను మరింత ముందుకు తీసుకుపోవాలని మండలి సంకల్పించింది. ఈ మహనీయులు సామాజికనైతిక విలువలు, విమర్శనాత్మక ఆలోచన, మేధోపరమైన పరిశోధన, విద్యార్థుల పట్ల మానవీయత, నిరంతర అభ్యాసం, తరగతి గదిలో ప్రజాస్వామ్యం, సమస్య పరిష్కార పద్ధతులు, విద్యార్థికేంద్రీకృత విధానాలు, అనుభవపూర్వక అభ్యాసం, ఉపాధ్యాయ శిక్షణ, విభిన్నత (డైవర్సిటీ), అలాగే సిలబస్‌లో ప్రపంచ దృక్పథాలను పొందుపరచడంలో విశేష సేవలందించారు



ఐనవోలు జాతరకు పటిష్ట ఏర్పాట్లను పూర్తి చేయాలి

- హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

ప్రతిపక్షం ప్రతినిధి హనుమకొండ జనవరి 9

ఐనవోలు జాతర ఏర్పాట్లను పర్యవేక్షించి, పనుల పురోగతిని అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్హనుమకొండ జిల్లా ఐనవోలు జాతరకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పటిష్ట ఏర్పాట్లను పూర్తిచేసి జాతర విజయవంతం అయ్యేలా చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. హనుమకొండ జిల్లా ఐనవోలు శ్రీ మల్లికార్జున స్వామి జాతర ఉత్సవాలు ఈ నెల 13 నుండి ప్రారంభం అవుతున్న నేపథ్యంలో వివిధ శాఖల ఆధ్వర్యంలో ఆలయం వద్ద చేసిన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా దేవాదాయ, పంచాయతీ రాజ్, మున్సిపల్, పోలీస్, రెవెన్యూ, వైద్య ఆరోగ్య, ఇతర శాఖల ఆధ్వర్యంలో ఇప్పటి వరకు చేసిన జాతర ఏర్పాట్లు, వాటి పురోగతి గురించి సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఐనవోలు మల్లికార్జున స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులకు ఎక్కడ కూడా ఇబ్బందులు కలగకుండా వివిధ శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. జాతర ఏర్పాట్లు సంబంధిత శాఖలు త్వరగా పూర్తి చేయాలన్నారు. ముందుగా ఆలయానికి వచ్చిన జిల్లా కలెక్టర్ కు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. ఆలయంలో స్వామివారిని కలెక్టర్ దర్శించుకున్నారు. అర్చకులు శేష వస్త్రాలను అందించి ఆశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో వివిధ శాఖల అధికారులతో ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ కమ్మగొని ప్రభాకర్, హనుమకొండ ఆర్డీఓ రాథోడ్ రమేష్, ఆలయ కార్యనిర్వాహణ అధికారి కందుల సుధాకర్, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీ రమాకాంత్, విద్యుత్ శాఖ ఎస్ఈ మధుసూదన్, సీఎం హెచ్ ఓ డాక్టర్ రాజారెడ్డి, తహసిల్దార్ విక్రమ్ కుమార్, ఎంపీడీవో నర్మద, ఎస్సై శ్రీనివాస్, ఏఈలు రవికుమార్, సురేష్ కుమార్, ఆలయ ధర్మకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



స్టడీ టూర్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- విద్యార్థినులకు కలెక్టర్ హితవు

ప్రతిపక్షం బ్యూరో,

నిజామాబాద్, జనవరి 09 : ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో జరిగే ఉద్యాన్ ఉత్సవ్ కార్యక్రమంలో పాల్గొనేందుకు వీలుగా ఏర్పాటు చేసిన స్టడీ టూర్ (అధ్యయన యాత్ర)ను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి విద్యార్థినులకు హితవు పలికారు. సికింద్రాబాద్, బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో నిర్వహిస్తున్న ఉద్యాన్ ఉత్సవ్‌లో ప్రదర్శనలను తిలకించేందుకు వీలుగా ప్రభుత్వం తరపున మోపాల్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలకు చెందిన 52మంది విద్యార్థినులను జిల్లా యంత్రాంగం తరపున ఎంపిక చేశారు. వీరిని శుక్రవారం ప్రత్యేక బస్సులో రాష్ట్రపతి నిలయంకు పంపించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం ఆవరణలో తెలంగాణ తల్లి విగ్రహం వద్ద విద్యార్థినులు వెళ్తున్న బస్సుకు కలెక్టర్ ఇలా త్రిపాఠి పచ్చ జెండా ఊపారు. ఈ సందర్భంగా బాలికలను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ, ఉద్యాన ఉత్సవ్ లో ఎన్నో రకాల పుష్పాలు, మొక్కలను ప్రదర్శనలో ఉంచుతారని, వాటి గురించి అవగాహన ఏర్పర్చుకోవాలని సూచించారు. కాగా, స్టడీ టూర్ కు వెళ్తున్న బాలికలకు అన్ని వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి పి.అశోక్, ఉద్యానవన శాఖ ఏ.పీ.డీ భారతి తదితరులు పాల్గొన్నారు.

హనుమకొండ జిల్లా వర్ధన్నపేట నియోజకవర్గంలో అధికార కాంగ్రెస్ పార్టీలో పదవుల పంపకం

ప్రతిపక్షం ప్రతినిధి హనుమకొండ జనవరి 9:

పంపకానికి త్వరలో శ్రీకారం చుట్టనున్నట్టు పార్టీ వర్గాల ద్వారా సమాచారం అందుతోంది. గత అనేక సంవత్సరాలుగా పార్టీని నమ్ముకొని నిస్వార్థంగా పనిచేస్తున్న కార్యకర్తలు, నాయకులు ఎంతో కాలంగా ఈ సందర్భం కోసం ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు సంక్రాంతికి ముందే పార్టీకి అండగా నిలిచిన నిజమైన నాయకులకు పదవులు కేటాయించే దిశగా ఆలోచన చేస్తున్నట్టు తెలుస్తోంది. 14 సంవత్సరాలకు పైగా పార్టీ కోసం పనిచేసిన చిన్న, పెద్ద నాయకులు ఎవరికి ఎప్పుడు ఏ పదవి వస్తుందోనని ఆశగా ఎదురు చూస్తూ ఎమ్మెల్యేను కలుస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. గతంలో టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేసి రాజకీయంగా, ఆర్థికంగా నష్టపోయిన అనేక మంది నాయకులు ఈసారి న్యాయం జరుగుతుందన్న ఆశతో ఉన్నారని తెలిపారు. ఈ సంక్రాంతిలోపు పదవుల పంపకం జరుగుతుందన్న వార్త కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపుతోంది. అయితే, గతంలో పార్టీ మారిన వారికి ప్రాధాన్యత ఇచ్చారన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్న నేపథ్యంలో, ఆ అపవాదులను తొలగించాలంటే నిజమైన కార్యకర్తలకే పదవులు ఇవ్వాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఆలస్యం జరిగినప్పటికీ, పార్టీకి ప్రాణం పోసిన నాయకులను గుర్తించి ఆశీర్వదించే నిర్ణయం తీసుకుంటే కాంగ్రెస్ పార్టీ మరింత బలపడుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల తీరును పరిశీలించిన కలెక్టర్

ప్రతిపక్షం ప్రతినిధి, కామారెడ్డి, జనవరి 9:



ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ కార్యక్రమంలో భాగంగా జరుగుతున్న ఇళ్ల నిర్మాణ పనుల తీరును శుక్రవారం దోమకొండ మండలం సీతారాంపల్లి గ్రామంలో లబ్ధిదారులు నిర్మించుకుంటున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనుల తీరును జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నిర్మాణ పనుల పురోగతి, నాణ్యత, ఉపయోగిస్తున్న నిర్మాణ సామగ్రి తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. పనులు నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని, ప్రభుత్వ మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటిస్తూ నాణ్యతలో ఎలాంటి రాజీ లేకుండా నిర్మాణాలు చేపట్టాలని లబ్ధిదారులు, సంబంధిత అధికారులకు సూచించారు. అలాగే లబ్ధిదారులకు అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందించాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట పిడి హౌసింగ్ విజయ పాల్ రెడ్డి, mro విజయ కుమార్, , ప్రత్యేక అధికారి జ్యోతి, ఎంపిడిఓ ప్రవీణ్ కుమార్, సర్పంచ్ నర్సయ్య, లబ్ధిదారులు, తదితరులు ఉన్నారు.

కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయ తనిఖీ

దోమకొండ మండలం సీతారాంపల్లి కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాన్ని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు జిల్లా కలెక్టర్‌ను బొకే అందించి ఆత్మీయంగా స్వాగతం పలికారు. విద్యార్థినులతో కలెక్టర్ మాట్లాడుతూ, విద్యాలయంలో అన్ని మౌలిక సదుపాయాలు, సౌకర్యాలు సరిగా ఉన్నాయా, భోజనం నాణ్యత ఎలా ఉందని, టాయిలెట్లు అందుబాటులో ఉన్నాయా, వాటిలో రన్నింగ్ వాటర్ వస్తున్నదా, త్రాగునీటి సమస్య ఏమైనా ఉందా అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మొక్కలు నాటి కేజీబీవీ ఆవరణలో నిర్మిస్తున్న పెండింగ్ లో ఉన్న సంపు నిర్మాణ పనులను పరిశీలించి ఆరా తీశారు. సంపు నిర్మాణ పనులు వెంటనే పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం స్టోరేజ్ ని పరిశీలించి సరకుల నిల్వలను సక్రమంగా నిర్వహించాలని తెలిపారు.
రిజిస్టర్ లను పరిశీలించి రిజిస్టర్ లో ఉన్న నిల్వలను స్టోరేజీలో ఉన్న నిల్వల వివరాలను ఆరా తీసి నాణ్యత ప్రమాణాలు పాటించాలని అన్నారు. ఈ సందర్భనలో ప్రిన్సిపల్ మంగమ్మ , mro విజయ్ కుమార్, ప్రత్యేక అధికారి జ్యోతి, ఎంపిడిఓ ప్రవీణ్ కుమార్, సర్పంచ్ భానుశ్రీ, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



రోజు రోజుకూ పెరుగుతున్న సైబర్ నేరాలతో నష్టపోతున్న బాధితులు తక్షణ సహాయం పొందడంలో ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి దేశంలోనే తొలిసారిగా సైబర్ మిత్రను తీసుకొచ్చినట్లు సిటీ పోలీస్ కమిషనర్ సజ్జనార్ తెలిపారు. హైదరాబాద్ పోలీసుల ఆధ్వర్యంలో సైబర్ మిత్ర(సీ-మిత్ర) ప్రత్యేక సెల్‌ను శుక్రవారం బషీర్‌బాగ్‌లోని సీసీఎస్ కార్యాలయంలో సజ్జనార్ ప్రారంభించారు. ప్రస్తుతం సైబర్ నేరాలు కూడా కొత్త రూపు సంతరించుకుంటున్నాయని, ఓటీపీ మోసాలు, డిజిటల్ అరెస్టులు, ట్రేడింగ్, ఇన్వెస్ట్‌మెంట్ మోసాల వంటివి ప్రజలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయని సజ్జనార్ అన్నారు.

- సీపీ సజ్జనార్

28 నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు..

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ఈ నెల 28న ప్రారంభం కానున్నాయి. కేంద్ర బడ్జెట్‌ను ఫిబ్రవరి 1న ఆదివారం ప్రవేశపెడతారు. సమావేశాల ప్రారంభ రోజైన 28న ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రెండు గంటల పాటు ప్రసంగిస్తారని సమావేశాల తాత్కాలిక షెడ్యూల్‌ను పార్లమెంటరీ వ్యవహారాల క్యాబినెట్ కమిటీ శుక్రవారం ప్రకటించింది. మరునాడు బీటింగ్ రీట్రీట్ వేడుక ఉండటంతో జనవరి 29న రెండు సభలు సమావేశం కావు. 30న జరిగే సమావేశంలో ఆర్థిక సర్వేను సభలో ప్రవేశపెడతారు. జనవరి 31న రెండు సభలు సమావేశం కావు. ఫిబ్రవరి 1న ఆదివారం సభలో కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెడతారు. రాష్ట్రపతి ప్రసంగం, కేంద్ర బడ్జెట్ పై ధన్యవాద తీర్మానంపై చర్చల తర్వాత ఫిబ్రవరి 13న పార్లమెంట్ దాదాపు నెల రోజుల పాటు వాయిదా పడుతుంది. పార్లమెంట్ మార్చి 9న తిరిగి సమావేశమై ఏప్రిల్ 2న గురువారం ముగుస్తుంది.



విశ్వ వీక్షణం



మోదీట్రంప్ చర్చలపై విదేశాంగ శాఖ కీలక ప్రకటన..

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో భారత ప్రధాని నరేంద్ర మోదీ నేరుగా మాట్లాడకపోవడమే వాణిజ్య ఒప్పందం కార్యరూపం దాల్చకపోవడానికి కారణమని అమెరికా వాణిజ్య మంత్రి హోవార్డ్ లుట్నిక్ చేసిన వ్యాఖ్యలపై భారత్ స్పందించింది. ఇరుదేశాలకు సంబంధించి వివిధ అంశాల్లో గతేడాది ప్రధాని మోదీ, ట్రంప్ (Donald Trump) ఎనిమిది సార్లు ఫోన్‌లో సంభాషించుకున్నారని భారత విదేశాంగ శాఖ (MEA) స్పష్టం చేసింది. రష్యా చమురు కొనుగోలు చేసే దేశాలపై అమెరికా అదనపు ఆంక్షలు విధించే బిల్లుపైనా అవగాహన ఉందని, పరిణామాలను నిశితంగా పరిశీలిస్తున్నామని తెలిపింది. ''అమెరికా వాణిజ్య మంత్రి వ్యాఖ్యలు చూశాం. ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై చర్చించేందుకు గతేడాది ఫిబ్రవరి 13 నాటికే ఇరుదేశాలు కట్టుబడి ఉన్నాయి. అప్పటి నుంచి పరస్పర ప్రయోజనం చేకూరే వాణిజ్య ఒప్పందం కోసం ఇరుపక్షాలు పలుమార్లు సంప్రదింపులు జరిపాయి. వీటి గురించి అమెరికా వాణిజ్య మంత్రి వ్యాఖ్యల్లో స్పష్టత లేదు. అనేకసార్లు ఒప్పందానికి దగ్గరగా వచ్చాం. ఇప్పటికీ దీనిపై ముందుకు వెళ్లేందుకు ఆసక్తిగా ఉన్నాం. గతేడాది ఎనిమిది సందర్భాల్లో ప్రధాని మోదీ, అధ్యక్షుడు ట్రంప్ ఫోన్‌లో సంభాషించుకున్నారు'' అని భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ పేర్కొన్నారు.

మైనార్టీల్లో మరింత భయం..''బంగ్లాదేశ్‌లో మైనార్టీలు, వారి ఇళ్లు, వ్యాపారాలపై వరుస దాడులు జరుగుతున్నాయి. ఈ అంశాన్ని గతంలోనే ప్రస్తావించాం. వీటిని వెంటనే పరిష్కరించాల్సిన అవసరం ఉంది. వ్యక్తిగత లేదా రాజకీయ వివాదాలుగా కొట్టిపారేసే ప్రయత్నాలు చేస్తే నేరస్థులు మరింత రెచ్చిపోయేందుకు కారణమవుతాయి. మైనార్టీల్లో మరింత భయాన్ని, అభద్రతా భావాన్ని పెంచుతాయి'' అని భారత విదేశాంగ శాఖ వెల్లడించింది..అమెరకా కాంగ్రెస్‌లో ప్రవేశపెట్టనున్న 500 శాతం సుంకాల విధింపు బిల్లు గురించి అవగాహన ఉందని, ప్రస్తుత పరిణామాలను నిశితంగా గమనిస్తున్నామని భారత్ వెల్లడించింది. చమురు అంశంపై తమ వైఖరి అందరికీ తెలిసిందేనని పేర్కొంది. ప్రపంచ మార్కెట్ల పరిస్థితులకు అనుగుణంగా స్పందిస్తున్నట్లు తెలిపింది. భారతీయుల ఇంధన భద్రత కాపాడటం తమ బాధ్యత అని భారత విదేశాంగ శాఖ స్పష్టం చేసింది.



వేడెక్కుతున్న కరేబియన్..

వెనెజువెలా నుంచి రాకపోకలు సాగించడంపై ఆంక్షలున్న నౌకలను లక్ష్యంగా పెట్టుకున్న ట్రంప్ యంత్రాంగం.. తాజాగా కరేబియన్ సముద్రంలో మరో చమురు నౌకను స్వాధీనం చేసుకుంది. 'ఒలినా' అనే నౌకను తమ ఆధీనంలోకి తీసుకున్నట్లు అమెరికా సైన్యం తెలిపింది. యూఎస్ మెరైన్ అండ్ నేవీ సాయంతో ఈ ఆపరేషన్ చేపట్టామని పేర్కొన్న అమెరికా సదరన్ కమాండ్.. నేరస్థులకు సురక్షితమైన ప్రదేశం లేదని స్పష్టం చేసింది.చమురు నౌకపై హెలికాప్టర్ల సాయంతో తమ బలగాలు దిగి, సెర్చ్ చేపట్టినట్లు అమెరికా సైన్యం వెల్లడించింది. ఇందుకు సంబంధించిన వీడియోను సోషల్ మీడియాలో పోస్టు చేసింది. ఇదిలాఉంటే, మాజీ అధ్యక్షుడు నికోలస్ మదురోను అదుపులోకి తీసుకున్న తర్వాత వెనెజువెలా చమురు నియంత్రణ తమ చేతుల్లోనే ఉన్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పేర్కొన్న విషయం తెలిసిందే. ఆ తర్వాత అక్కడికి రాకపోకలు సాగించే నౌకలను లక్ష్యంగా చేసుకొని స్వాధీనం చేసుకుంటోంది. తాజాగా ఐదో నౌకను తమ ఆధీనంలోకి తీసుకోవడం గమనార్హం.


మీ దేశంపై దృష్టి పెట్టండి



ఇరాన్‌లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా చోటుచేసుకుంటున్న అల్లర్లపై ఆ దేశ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ స్పందించారు. తమ దేశంలో ఆందోళనకారులను హెచ్చరించిన ఆయన.. విదేశీ శక్తుల చేతుల్లో కిరాయి సైనికుల్లా వ్యవహరించే వారిని సహించే ప్రసక్తే లేదన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ను ఉద్దేశిస్తూ.. ఇతర దేశాలకు చెప్పే ముందు సొంత దేశంపై దృష్టి పెట్టాలని హితవు పలికారు. ఈ మేరకు ఆయన ఓ వీడియో సందేశాన్ని విడుదల చేశారు. ఇతర దేశాధ్యక్షుడిని సంతోష పెట్టేందుకు సొంత వీధులను నాశనం చేసుకుంటున్నారంటూ ఆందోళనకారులను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ప్రవాసంలో తలదాచుకున్న యువరాజు రెజా పహ్లావి (గతంలో అమెరికా మద్దతుతో దేశాన్ని పాలించిన 'షా' వారసుడు) ఇచ్చిన పిలుపు మేరకు ఇరాన్‌లో ఆందోళనకారులు పెద్ద ఎత్తున రోడ్లపైకి వచ్చి నిరసనలు చేపట్టారు. గురువారం మొదలైన ఈ నిరసనలు శుక్రవారం ఉదయం వరకు కొనసాగాయి. ఇంటర్నెట్, టెలిఫోన్ సేవలను ప్రభుత్వం నిలిపేసినప్పటికీ ఆందోళనకారులు పెద్ద ఎత్తున పాల్గొనడం గమనార్హం. ఈ నేపథ్యంలోనే స్పందించిన సుప్రీం లీడర్.. యువత ఏకతాటిపై ఉండాలని, దేశం ఐకమత్యంగా ఉన్నప్పుడే ఎలాంటి శత్రువునైనా ఎదుర్కోవచ్చన్నారు.









బీపీని తగ్గించే పండ్లు, కూరగాయలు



ప్రపంచ వ్యాప్తంగా ఎదుర్కొంటున్న అతి పెద్ద అనారోగ్య సమస్యల్లో రక్తపోటు కూడా ఒకటి. ప్రతి సంవత్సరం మే 17 న ప్రపంచ వ్యాప్తంగా రక్తపోటు దినోత్సవాన్ని జరుపుకుంటారు. అధిక రక్తపోటు సమస్యతో బాధపడే వారి సంఖ్య రోజురోజుకీ పెరుగుతుందని చెప్పవచ్చు. ఇది ఒక సైలెంట్ కిల్లర్ గా శరీర మొత్తం ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుంది. అధిక రక్తపోటు కారణంగా మధుమేహం, స్ట్రోక్, గుండె జబ్బులు, మూత్రపిండాల వైఫల్యం, బ్రెయిన్ స్ట్రోక్ వంటి అనేక సమస్యలు వచ్చే అవకాశం ఉంది. అధిక రక్తపోటు దాదాపుగా ఎటువంటి లక్షణాలను చూపించదు. తరచూ రక్తపోటును పరీక్షించుకోవడమే సరైన మార్గం. అమెరికన్ హార్ట్ అసోసియేషన్ ప్రకారం 120/80 ని రక్తపోటు సాధారణ పరిమితిగా పరిగణిస్తారు. 140 /90 మధ్య పరిధిని ప్రీ హైపర్ టెన్షన్ గా భావిస్తారు. అలాగే 140/90కంటే ఎక్కువ రీడింగ్ ను గమనిస్తే మీరు అధిక రక్తపోటుతో బాధపడుతున్నారని అర్థం.

అరటి పండ్లు..

ఉప్పును అధికంగా తీసుకోవడం, ఒత్తిడి, ధూమపానం, మద్యపానం, నిల్వ ఉంచిన ఆహారాలను తీసుకోవడం వంటి వాటిని రక్తపోటుకు కారణాలుగా చెప్పవచ్చు. ఒక్కసారి ఈ సమస్య బారిన పడితే జీవితాంతం మందులు వాడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. కనుక మనం రక్తపోటు బారిన పడకుండా చూసుకోవడమే ఉత్తమమైన పని. రక్తపోటుతో బాధపడే వారు సహజ సిద్ధమైన ఆహారాలను తీసుకోవడం ద్వారా కూడా రక్తపోటును అదుపులో ఉంచుకోవచ్చు. ఈ ఆహారాలను తీసుకోవడం వల్ల గుండె ఆరోగ్యం మెరుగుపడడంతో పాటు మొత్తం ఆరోగ్యానికి మేలు కలుగుతుంది. అధిక రక్తపోటును తగ్గించే ఆహారాల గురించి వైద్యులు వివరిస్తున్నారు. అధిక రక్తపోటుతో బాధపడే వారు అరటిపండును తీసుకోవడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. అరటిపండులో పొటాషియం అధికంగా ఉంటుంది. ఇది రక్తపోటును తగ్గించడంలో సహాయపడుతుంది. అరటిపండును నేరుగా తీసుకోవడంతో పాటు స్మూతీ, మిల్క్ షేక్ వంటి వాటిని తయారు చేసి కూడా తీసుకోవచ్చు.

పాలకూర..

పాలకూరను తీసుకోవడం వల్ల కూడా రక్తపోటు అదుపులో ఉంటుంది. దీనిలో పొటాషియంతో పాటు మెగ్నీషియం, క్యాల్షియం వంటి పోషకాలు ఉంటాయి. దీనిని తీసుకోవడం వల్ల రక్తపోటు తగ్గడంతో పాటు ఎముకలు ధృడంగా ఉంటాయి. అలాగే రోజుకు నాలుగు సెలెరీ కాడలను తీసుకోవడం వల్ల రక్తపోటు అదుపులో ఉంటుంది. వీటిలో థాలైడ్స్ అని పిలువబడే ఫైటోకెమికల్స్ ఉంటాయి. ఇవి కండరాల కణజాలాన్ని సడలించి రక్తప్రవాహాన్ని పెంచడంలో సహాయపడతాయి. తద్వారా రక్తపోటును తగ్గించడంలో దోహదపడతాయి. రక్తపోటును అదుపులో ఉంచడంలో ఓట్ మీల్ కూడా మనకు ఉపయోగపడుతుంది. ఆహారంలో భాగంగా ఓట్ మీల్ ను తీసుకోవడం వల్ల సిస్టోలిక్, డయాస్టొలిక్ ఒత్తిడి రెండు కూడా అదుపులో ఉంటాయి. అవకాడోలలో ఒలీక్ ఆమ్లం ఉంటుంది. వీటితో పాటు ఫోలేట్, పొటాషియం, విటమిన్ ఎ, కె, ఇ, ఫైబర్ వంటి పోషకాలు కూడా ఉంటాయి. దీనిని తీసుకోవడం వల్ల రక్తపోటు అదుపులో ఉంటుంది.

పుచ్చకాయలు..

పుచ్చకాయను తీసుకోవడం వల్ల కూడా అధిక రక్తపోటు తగ్గుతుంది. ఇందులో ఎల్ సిట్రులైన్ అనే అమైనో ఆమ్లం ఉంటుంది. అలాగే పొటాషియం, ఫైబర్, విటమిన్ ఎ వంటి పోషకాలు కూడా ఉంటాయి. ఇవి రక్తపోటును తగ్గించడంలో దోహదపడతాయి. రోజూ ఒక గ్లాస్ బీట్ రూట్ ను తీసుకోవడం వల్ల కూడా రక్తపోటు అదుపులో ఉంటుంది. బీట్ రూట్ లో నైట్రేట్లు అధికంగా ఉంటాయి. ఇవి రక్తపోటును తగ్గించడంలో ఉపయోగపడతాయి. పొద్దుతిరుగుడు విత్తనాలలో విటమిన్ ఇ, ఫోలిక్ యాసిడ్, ప్రోటీన్, ఫైబర్ వంటివి ఉంటాయి. వీటిని తీసుకోవడం వల్ల గుండె ఆరోగ్యం మెరుగుపడడంతో పాటు రక్తపోటు కూడా అదుపులో ఉంటుంది. అలాగే రోజూ ఒక గ్లాస్ నారింజ పండు రసాన్ని తీసుకోవడం వల్ల కూడా రక్తపోటును తగ్గించుకోవచ్చు. దీనిలో విటమిన్ సి తో పాటు ఫైబర్ ఉంటుంది. రక్తపోటుతో బాధపడే వారికి నారింజ పండు అద్భుతంగా పని చేస్తుందని చెప్పవచ్చు.

క్యారెట్లు..

రక్తపోటును తగ్గించడంలో క్యారెట్ కూడా మనకు దోహదపడుతుంది. క్యారెట్ లో బీటా కెరోటీన్, పొటాషియం అధికంగా ఉంటాయి. దీనిని తీసుకోవడం వల్ల గుండె, మూత్రపిండాల ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది. ఇలా సరైన ఆహారాలను తీసుకోవడంతో పాటు ఉప్పును తక్కువగా తీసుకోవడం, ఒత్తిడిని తగ్గించుకోవడం, ప్రతిరోజూ వ్యాయామం చేయడం, కనీసం రోజుకు 6 నుండి 8 గంటల పాటు నిద్రపోవడం, కాఫీని తక్కువగా తీసుకోవడం, ఆల్కహాల్ ను, ధూమపానాన్ని మానివేయడం వంటివి చేయాలి. ఇలా చేయడం వల్ల రక్తపోటు తగ్గడంతో పాటు భవిష్యత్తులో కూడా రాకుండా ఉంటుంది.



నదైన్ నయా విధ్వంసం

డబ్ల్యూపీఎల్ నాలుగో సీజన్ తొలి మ్యాచే అభిమానులకు బోలెడంత వినోదాన్ని పంచింది. శుక్రవారం చివరి బంతి వరకు ఉత్కంఠభరితంగా సాగిన పోరులో ఆర్సీబీ 3 వికెట్ల తేడాతో ముంబయిపై అనూహ్య విజయాన్నందుకుంది. ఆశల్లేని స్థితిలో నదైన్ డిక్లెర్క్ (63 నాటౌట్ ; 44 బంతుల్లో 7×4, 2×6) సంచలన ఇన్నింగ్స్ ఆడడంతో ఆర్సీబీ 3 వికెట్లు కోల్పోయి సరిగ్గా 20 ఓవర్లలో 155 పరుగుల లక్ష్యాన్ని ఛేదించింది. ముంబయి బౌలర్లలో అమేలియా కెర్ (2/13), నికోలా కేరీ (2/35) రాణించారు. మొదట సజీవన్ సజన (45; 25 బంతుల్లో 7×4, 1×6), నికోలా కేరీ (40; 29 బంతుల్లో 4×4) మెరుపులతో ముంబయి 6 వికెట్లకు 154 పరుగులు చేసింది. నదైన్ (4/26) బౌలింగ్‌లోనూ అదరగొట్టింది. డబ్ల్యూపీఎల్‌లో ఆమెకిది రెండో మ్యాచ్ మాత్రమే.

ఓటమి ఖాయమనుకుంటే..: రెండు నెలల కిందట వన్డే ప్రపంచకప్‌లో విశాఖపట్నంలో భారత్‌తో జరిగిన మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాకు ఓటమి ఖాయమనుకున్న మ్యాచ్‌లో నదైన్ డిక్లెర్క్ (84 నాటౌట్) ఎలా చెలరేగిపోయిందో తన జట్టును ఎలా గెలిపించిందో భారత అభిమానులకు గుర్తుండే ఉంటుంది. ఆ టోర్నీలో బంగ్లాదేశ్‌తో మరో మ్యాచ్‌లోనూ నదైన్ అలాంటి ఇన్నింగ్సే ఆడింది. ఇప్పుడు డబ్ల్యూపీఎల్‌లోనూ ఆర్సీబీకి ఓటమి తప్పదనుకున్న స్థితిలో ఆమె విధ్వంసక ఇన్నింగ్స్ ఆ జట్టుకు విజయాన్నందించింది. ఆమె బ్యాటింగ్‌కు వచ్చిన ఓవర్ పూర్తయ్యేసరికి ఆర్సీబీ స్కోరు 65/5. గ్రేస్ హారిస్ (25), స్మృతి మంధాన (18) జట్టుకు మెరుపు ఆరంభాన్నే ఇచ్చినప్పటికీ.. 25 పరుగుల వ్యవధిలో 5 వికెట్లు కోల్పోయిన ఆర్సీబీ పీకల్లోతు కష్టాల్లో పడింది. గొప్పగా బౌలింగ్ చేసిన అమేలియా.. ఎనిమిదో ఓవర్లో 2 పరుగులే ఇచ్చి రాధ యాదవ్ (1), రిచా ఘోష్ (6)లను ఔట్ చేయడంతో ఆర్సీబీ ఓటమి బాటలో సాగింది. అయితే అరుంధతి (20)తో కలిసి పోరాడిన నదైన్.. జట్టును పోటీలోకి తెచ్చింది. 16 ఓవర్లకు 117/5తో ఆర్సీబీ మెరుగైన స్థితికి చేరుకుంది. కానీ తర్వాతి ఓవర్లో నికోలా కేరీ.. 4 పరుగులే ఇచ్చి అరుంధతి, శ్రేయాంక (1)లను ఔట్ చేయడంతో సమీకరణం కఠినంగా మారింది. తర్వాతి 2 ఓవర్లలో 16 పరుగులే రావడం, అనుభవజ్ఞురాలైన నాట్ సీవర్ చివరి ఓవర్‌ను రెండు వరుస డాట్స్‌తో మొదలు పెట్టడంతో ముంబయి గెలుపు లాంఛనమే అనిపించింది. కానీ చివరి నాలుగు బంతులకు నదైన్ భారీ షాట్లు ఆడి ఆర్సీబీకి అనూహ్య విజయాన్నందించింది.మెరిసిన నికోలా, సజన: మొదట టాస్ ఓడి బ్యాటింగ్ చేసిన ముంబయి ఇన్నింగ్స్‌ను పేలవంగా మొదలు పెట్టింది. డబ్ల్యూపీఎల్‌లో తొలి మ్యాచ్ ఆడిన ఇంగ్లాండ్ ఫాస్ట్‌బౌలర్ లారెన్ బెల్ అద్భుత బౌలింగ్‌తో ఆర్సీబీకి అదిరే ఆరంభాన్నిచ్చింది. దూకుడుగా ఆడే అమేలియా కెర్ బ్యాటింగ్ చేస్తుండగా తొలి ఓవర్‌ను లారెన్ మెయిడెన్ వేయడం విశేషం. లారెన్ వేసిన తర్వాతి ఓవర్లోనూ తడబాటు కొనసాగించిన అమేలియా (15 బంతుల్లో 4).. అరుంధతికి తేలికైన క్యాచ్ ఇచ్చి వెనుదిరిగింది. ప్రమాదకర నాట్ సీవర్ (4)ను నదైన్ బౌలింగ్‌లో స్టంపౌట్ అయిపోయింది. అయితే మరో ఎండ్‌లో దూకుడుగా ఆడుతున్న కమలిని (32; 28 బంతుల్లో 5×4)కి కెప్టెన్ హర్మన్‌ప్రీత్ (20) తోడవడంతో ముంబయి 63/2తో పుంజుకుంది. ఈ ఇద్దరూ వరుస ఓవర్లలో ఔటైపోవడంతో ముంబయికి మళ్లీ ఇబ్బందులు తప్పలేదు. పరుగుల వేగం కూడా పడిపోవడంతో 14 ఓవర్లకు 85/4తో నిలిచిన ముంబయి.. 130 పరుగులకు మించేలా కనిపించలేదు. కానీ క్రీజులో కుదురుకున్న నికోలా, సజన చివరి ఓవర్లలో చెలరేగిపోవడంతో స్కోరు అనూహ్యంగా 150 దాటింది. ఆ జట్టు ఇంకా ఎక్కువ స్కోరే చేయాల్సింది. కానీ నదైన్ చివరి ఓవర్లో 5 పరుగులే ఇచ్చి వీళ్లిద్దరినీ ఔట్ చేసింది.

ముంబయి ఇండియన్స్ ఇన్నింగ్స్: అమేలియా (సి) అరుంధతి (బి) లారెన్ 4; కమలిని (బి) శ్రేయాంక 32; నాట్ సీవర్ (స్టంప్డ్) రిచా (బి) నదైన్ 4; హర్మన్‌ప్రీత్ (సి) రిచా (బి) నదైన్ 20; నికోలా (సి) హేమలత (బి) నదైన్ 40; సజన (సి) స్మృతి (బి) నదైన్ 45; అమన్‌జ్యోత్ నాటౌట్ 4; పూనమ్ నాటౌట్ 0; ఎక్స్‌ట్రాలు 9 మొత్తం: (20 ఓవర్లలో 6 వికెట్లకు) 154; వికెట్ల పతనం: 121, 235, 363, 467, 5149, 6154; బౌలింగ్: లారెన్ బెల్ 41141; లిన్సీ స్మిత్ 20230; అరుంధతి రెడ్డి 40370; నదైన్ డిక్లెర్క్ 40264; శ్రేయాంక పాటిల్ 40321; రాధ యాదవ్ 20210

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఇన్నింగ్స్: గ్రేస్ హారిస్ (సి) షబ్నిమ్ (బి) నాట్ సీవర్ 25; స్మృతి మంధాన (సి) పూనమ్ (బి) షబ్నిమ్ 18; హేమలత ఎల్బీ (బి) అమన్‌జ్యోత్ 7; రిచా ఘోష్ (సి) నికోలా (బి) అమేలియా 6; రాధ యాదవ్ (బి) అమేలియా 1; నదైన్ నాటౌట్ 63; అరుంధతి (సి) అమేలియా (బి) నికోలా 20; శ్రేయాంక (బి) నికోలా 1; ప్రేమ నాటౌట్ 8; ఎక్స్‌ట్రాలు 8 మొత్తం: (20 ఓవర్లలో 7 వికెట్లకు) 157; వికెట్ల పతనం: 140, 247, 362, 463, 565, 6117, 7121; బౌలింగ్: నాట్ సీవర్ 40471; షబ్నిమ్ ఇస్మాయిల్ 40261; నికోలా కేరీ 40352; అమన్‌జ్యోత్ 30181; అమేలియా కెర్ 40132; సైకా ఇషాక్ 10130



స్మృతి, హర్మన్‌లే ఆదర్శం



సీనియర్ ప్లేయర్లు హర్మన్‌ప్రీత్‌కౌర్, స్మృతి మంధాన తనకు ఆదర్శమని భారత మహిళల క్రికెట్ జట్టు యువ స్పిన్నర్ వైష్ణవి శర్మ చెప్పింది. ఈ 20 ఏళ్ల ఎడమ చేతి వాటం స్పిన్నర్ ఇటీవల అంతర్జాతీయ క్రికెట్‌లో అడుగు పెట్టింది. శ్రీలంకతో జరిగిన టీ20 సిరీస్‌లో పొదుపుగా బౌలింగ్ చేసి 5 వికెట్లు పడగొట్టింది. "వృత్తి పరంగా మా నాన్న జ్యోతిషుడు కావడంతో నేను క్రీడల్లోకి గానీ, వైద్య రంగంలోకి గానీ వెళతానని అంచనా వేశాడు. బాల్యం నుంచి నాకు కూడా ఆటలపైనే ఆసక్తి. రోజూ సాయంత్రం కసరత్తు చేసేదాన్ని. 11 12 ఏళ్ల వయసులో మధ్యప్రదేశ్ తరపున తొలి అండర్ 19 మ్యాచ్‌తో నా ప్రయాణం మొదలైంది. డబ్ల్యూపీఎల్‌లో అవకాశం వస్తుందని ఆశించాను. వేలంలో ఎవరూ తీసుకోకపోవడంతో కాస్త నిరాశ చెందాను. దాన్ని నా ఆటపై ప్రభావం పడనివ్వకుండా.. దేశవాళీల్లో ఉత్తమ ప్రదర్శన చేసేందుకు ప్రయత్నించాను. శ్రీలంకతో సిరీస్‌లో భారత జట్టుకు ఎంపికయ్యాక ప్రపంచకప్ విజేతల మధ్యకు వెళ్లేందుకు కంగారుపడ్డా. అయితే అందరూ నన్ను చక్కగా ఆహ్వానించారు. హర్మన్ పోరాట పటిమ, స్మృతి ఆట తీరు నుంచి స్ఫూర్తి పొందాను. వారితో కలిసి ఆడటం గొప్పగా అనిపిస్తోంది" అని వైష్ణవి చెప్పింది.




9 ఏళ్ల తర్వాత మళ్లీ 'గోల్‌మాల్'కి సిద్ధం

బ్లాక్ బస్టర్ ఫిల్మ్ మేకర్ గుణ శేఖర్ రూపొందిస్తోన్న లేటెస్ట్ మూవీ 'యుఫోరియా'. నూతన నటీనటులతో గుణ శేఖర్ నేటి యూత్‌కి, ఫ్యామిలీ ఆడియెన్స్‌కి కనెక్ట్ అయ్యేలా వైవిధ్యమైన కాన్సెప్ట్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రంలో భూమిక చావ్లా, గౌతమ్ వాసుదేవ్ మీనన్, సారా అర్జున్, నాజర్, రోహిత్, విఘ్నేష్ గవిరెడ్డి, లిఖిత యలమంచలి, అడ్డాల పృధ్వీరాజ్, కల్ప లత, సాయి శ్రీనికా రెడ్డి, అశ్రిత వేముగంటి, మాథ్యూ వర్గీస్, ఆదర్శ్ బాలకృష్ణ, రవి ప్రకాష్, నవీనా రెడ్డి, లికిత్ నాయుడు వంటి వారు ముఖ్య పాత్రల్ని పోషించారు. ఇప్పటికే సినిమా నుంచి విడుదలైన గ్లింప్స్, ఫ్లై హై పాటకు సూపర్బ్ రెస్పాన్స్ వచ్చింది. తాజాగా కొత్త రిలీజ్ డేట్‌ను ప్రకటిస్తూనే టీజర్‌ను విడుదల చేశారు. టీజర్‌ను గమనిస్తే.. నేటి యూత్ డ్రగ్స్ మహమ్మారి వల్ల ఎలా పెడదారులు పడుతుందనే విషయాన్ని చూపిస్తూనే తల్లిదండ్రుల పెంపకం ఎలా ఉండాలనే విషయాన్ని భూమిక పాత్రతో పరిచయం చేశారు. టీజర్ చాలా ఇంట్రెస్టింగ్ గా ఉంది. యుఫోరియా చిత్రాన్ని ముందుగా ఈ ఏడాది క్రిస్మస్ సందర్భంగా డిసెంబర్ 25న విడుదల చేయాలని మేకర్స్ భావించారు. అయితే అనుకోకుండా చాలా సినిమాలు అదే రోజున రిలీజ్ అవుతున్నాయి. బాక్సాఫీస్ దగ్గర ఈ క్లాష్‌ను తగ్గించటానికి యుఫోరియా సినిమాను ఫిబ్రవరి 6, 2026న విడుదల చేయటానికి మేకర్స్ నిర్ణయించుకుని అధికారికంగా ప్రకటించారు. వైవిధ్యమైన కాన్సెప్ట్‌తో రాబోతున్న యుఫోరియాలో గుణ శేఖర్ అసలేం చూపించబోతున్నారో చూడటానికి అందరూ ఆసక్తిగా వెయిట్ చేస్తున్నారు.

యష్ పాన్ఇండియా మేనియా!

అప్పటివరకు కేవలం కన్నడ ఇండస్ట్రీ వరకు మాత్రమే తెలిసిన యష్, కెజిఎఫ్ ఫ్రాంచైజ్ సినిమాల తర్వాత ప్యాన్ ఇండియా హీరో అయిపోయారు. ఆ రెండు సినిమాల వల్ల ఆయనకు ఎంతో స్టార్‌డమ్, క్రేజ్, డిమాండ్ ఏర్పడ్డాయి. అందుకే కెజిఎఫ్ 2 తర్వాత యష్ ఏ డైరెక్టర్ తో సినిమా చేస్తారా? ఎలాంటి సినిమా చేస్తారా అని అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురుచూశారు. కానీ యష్ మాత్రం అందరి అంచనాలకు భిన్నంగా గీతూ మోహనదాస్ అనే లేడీ డైరెక్టర్ తో చేతులు కలిపారు. ఎవరూ ఊహించని విధంగా గీతూతో సినిమాను ఓకే చేసిన యష్, ఆ మూవీలో నటించడం మాత్రమే కాకుండా దానికి నిర్మాతగా కూడా వ్యవహరిస్తున్నారు. టాక్సిక్ అనే టైటిల్ తో తెరకెక్కుతున్న ఈ మూవీని గ్యాంగ్‌స్టర్ సినిమాగా వస్తుండగా ఈ సినిమాలో భారీ తారాగణమే నటిస్తోంది. ఈ సినిమాను ఇంగ్లీష్‌లో కూడా ఒకేసారి తెరకెక్కిస్తుండటంతో పాటూ సినిమాలో పలు హాలీవుడ్ టెక్నీషియన్లను కూడా ఇన్వాల్వ్ చేసి టాక్సిక్ కు మంచి బజ్ తీసుకొచ్చారు మేకర్స్. రీసెంట్ గా ఈ సినిమా నుంచి యష్ బర్త్ డే సందర్భంగా టీజర్ ను రిలీజ్ చేయగా, ఆ టీజర్‌కు ఆడియన్స్ నుంచి మంచి రెస్పాన్స్ వస్తోంది. అయితే టీజర్ రిలీజ్ తర్వాత సినిమాలో నటించే నటీనటుల రెమ్యూనరేషన్ గురించి తెగ డిస్కషన్ నడుస్తోంది.



రూ.300 కోట్ల భారీ బడ్జెట్ తో రూపొందుతున్న ఈ సినిమా కోసం యష్ ఏకంగా రూ.50 కోట్ల వరకు రెమ్యూనరేషన్ ను తీసుకుంటున్నారని, హీరోయిన్ గా నటిస్తున్న కియారా అద్వానీ గతంలో కంటే చాలా ఎక్కువగా తన రెమ్యూనరేషన్ ను పెంచి రూ.15 కోట్లు తీసుకుంటున్నారని, కీలక పాత్రలో నటిస్తున్న నయనతార 1218 కోట్ల వరకు ఛార్జ్ చేస్తున్నారని అంటున్నారు. తారా సుతారియా రూ.23 కోట్లు తీసుకుంటున్నారని, హుమా ఖురేషి 23 కోట్లు అందుకుంటున్నారని, రుక్మిణి వసంత్ రూ.35 కోట్లు తీసుకుంటున్నారని అంటున్నారు. ఈ వార్తల్లో నిజమెంతన్నది పక్కన పెడితే టాక్సిక్‌లోని తారాగణం కోసమే బడ్జెట్ భారీగా పెరిగిందనేది వాస్తవం. మార్చి 19న రిలీజ్ కానున్న టాక్సిక్ ఎలాంటి ఫలితాన్ని ఇస్తుందో చూడాలి.



వాస్తవ సంఘటనలతో 'సైలెంట్ స్క్రీమ్స్'

తెలంగాణలో జరిగిన యథార్థ సంఘటనల ఆధారంగా రూపొందిన 'సైలెంట్ స్క్రీమ్స్' సిరీస్ సంక్రాంతిని పురస్కరించుకుని సన్ నెక్ట్స్ ద్వారా విడుదల కానున్నట్లు ఆ సంస్థ ప్రకటించింది. వరంగల్, ఆసిఫాబాద్, నల్గొండ జిల్లాల్లో జరిగిన ఘటనల ఆధారంగా ఓ క్రైమ్ డాక్యుమెంటరీగా రూపొందిన ఈ సిరిస్ ప్రముఖ కథానాయిక శ్రుతిహాసన్ వ్యాఖ్యానంతో సాగుతుంది. నేరాల వివరాలకే పరిమితం కాకుండా, న్యాయం కోసం బాధితులు సాగించిన పోరాటానికి, వాళ్ల మౌన వేదనకి అద్దం పడుతూ ఈ సిరీస్ సాగుతుందని సన్‌నెక్ట్స్ ఓ ప్రకటనలో పేర్కొంది.

రవితేజశివ కాంబినేషన్ నేపథ్యమదా?

మాస్ రాజా రవితేజ మళ్లీ క్లాస్ బాట పట్టిన సంగతి తెలిసిందే. మాస్ అటెంప్ట్ లు ఫెయిల్ అయ్యే సరికి రూట్ మార్చి కొత్తగా ముందుకెళ్తున్నాడు. ఈ సంక్రాంతి కానుకగా 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' అంటూ ప్రేక్షకుల్ని పలకరించబోతున్నాడు. పక్కా ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. సినిమాకు ప్రచార చిత్రాలే మంచి బజ్‌ను తీసుకొచ్చాయి. ఇప్పటికే సంక్రాంతి రేస్ నుంచి ఓ సినిమా ఫలితం తారు మారు అవ్వడంతో ఈ సినిమాపై అంచనాలు రెట్టింపు అవ్వడం ఖాయం. కుటుంబ అనుబంధం, భావోద్వేగాన్ని హైలైట్ చేస్తూ కిషోర్ తిరుమల చేసిన చిత్రమిది. ఈ సినిమా రిలీజ్ అనంతరం రవితేజ తదుపరి సినిమా కూడా మరో క్లాసిక్ డైరెక్టర్ శివ నిర్వాణ తెరకెక్కించనున్నాడు. ఇప్పటికే ప్రాజెక్ట్ లాక్ అయింది. అధికారికంగా విషయం ఇంకా బయటకు రాలేదు గానీ, లాక్ అయిందని గట్టిగానే వినిపిస్తోంది. ఈ సినిమా నేపథ్యం ఏంటి? అన్నది ఇంకా లీక్ అవ్వలేదు. ఈ నేపథ్యంలో తాజాగా ఇది తండ్రీకూతుళ్ల కథగా వినిపిస్తోంది. ఇదే కథకు క్రైమ్ థ్రిల్లర్ అంశాన్ని జోడించి తెరకెక్కించబోతున్నాడని దర్శక వర్గాల నుంచి తెలిసింది. క్రైమ్ థ్రిల్లర్ అంటే రవితేజకు కొత్తేం కాదు. ఇప్పటికే ఈ జానర్ లో చాలా సినిమాలు చేసాడు. కానీ శివ నిర్వాణకు మాత్రం కొత్త ప్రయత్నమనే చెప్పాలి. ఇప్పటి వరకూ శివ కేవలం క్లాసిక్ లవ్ స్టోరీలు మాత్రమే డీల్ చేసాడు. తన ప్రేమ కథని తెలివిగా ఎమోషన్‌తో ప్రేక్షకులకు కనెక్ట్ చేసాడు. 'ఖుషీ' సహా అదే ప్యాటర్న్ లో సాగినా డివైడ్ టాక్ తో బయట పడింది. నానితో 'టక్ జగదీష్' అంటూ యక్షన్ డ్రామా ప్రయత్నించాడు కానీ ఫలించలేదు. ఈ జానర్ శివకు పూర్తిగా కొత్త. మరి తండ్రీ కూతుళ్ల క్రైమ్ థ్రిల్లర్ల కథని శివ ఎంత కొత్తగా చూపిస్తాడు? అన్నది ఆసక్తికరం. కుమార్తె సెంటిమెంట్ రవితేజకు బాగా కలిసొచ్చిన పాయింట్. 'విక్రమార్కుడు' లో తండ్రికూతురు బాండింగ్ ఎంతగా వర్కౌట్ అయిందో తెలిసిందే. అందులో యాక్షన్ సన్నివేశాలు ఎంత గొప్పగా పండుతాయో? అంతకు మించి రవితేజతో కూమార్తె బాండింగ్ సన్నివేశాలు అంతకు మంచి అందంగా పండాయి. ఆ సన్నివేశాలు రక్తి కట్టించాయి. ఆ తర్వాత మళ్లీ రవితేజ ఆ నేపథ్యంలో మరో సినిమా చేయలేదు. మళ్లీ ఇంత కాలానికి శివ నిర్వాణ అదే బాండింగ్ ని ఎంచుకోవడం ఇంట్రెస్టింగ్.



Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana - 500013.
Published at H.No. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana - 500008. Editor: FAZUL RAHAMAN MOHAMMED. 040-4390 2732, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200